ప్రతిపక్షం

www.prathipaksham.in

సోమవారం 08.12.2025 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 258 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



వివాదాస్పద వ్యాఖ్యలు.. వివరణ 8



సోమవారం నుంచి రెండు రోజుల పాటు తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ జరగనుంది. ఈ సమ్మిట్‌ను తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించనున్నారు. సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఈ సమ్మిట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించనున్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో వివిధ అంశాలపై 27 సెషన్లలో చర్చలు జరగనున్నాయి. గ్లోబల్ సమ్మిట్‌కు 44 దేశాల నుంచి 154 మంది ప్రతినిధులు, అతిథులు హైదరాబాద్‌కు తరలి రానున్నారు. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ పరిసర ప్రాంతాలో దాదాపు ఆరు వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెంబర్ 14 నుంచి గ్లోబల్ సమ్మిట్ వేదిక వరకు భారీగా పోలీసులు మోహరించారు.

నిన్నటి వరకు ఒక లెక్క!

గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరో లెక్క

భారత్ ఫ్యూచర్ సిటీ మకుటాయమానం

రేపటి తెలంగాణ ప్రగతికి వేగుచుక్క

- జాతి కోసం, జనహితం కోసమే కలలు
- అందుకు మహా సంకల్పం కావాలి
- అవనిపై తెలంగాణను శిఖరాగ్రాన నిలపాలి
- అందుకోసమే నిరంతరం శ్రమిస్తున్నాం
- ఆశీర్వదించిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు
- కులగణనతో బీసీల ఆకాంక్షలు కొత్త మలుపు
- వర్గీకరణతో మాదిగ సోదరుల ఉద్యమానికి సార్థకత
- తెలంగాణ సమాజానికి సీఎం రేవంత్ సందేశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 7 : రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి సరిగ్గా రెండేళ్లు పూర్తవుతోంది. ఇదే సమయంలో ఫ్యూచర్ సిటీ వేదికగా తెలంగాణ రైజింగ్ సమ్మిట్ 8వ తేదీన ప్రారంభకానుంది. అలాంటి వేళ సీఎం రేవంత్ రెడ్డి తన ఎక్స్ ఖాతా వేదికగా ఆదివారం స్పందించారు. జాతి కోసం.. జనహితం కోసం.. గొప్ప కలలు కనాలంటే ధైర్యం ఉండాలన్నారు. గొప్ప కార్యాలు చేయాలంటే మహా సంకల్పం కావాలని పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం ఆ ధైర్యం ఇచ్చి.. తమ ఓటుతో గెలుపు సంకల్పం ఇచ్చి.. నిండు మనసుతో ఆశీర్వదించిన తెలంగాణ ప్రజలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. అవనిపై తెలంగాణను శిఖరాగ్రాన నిలిపేందుకు శ్రమిస్తున్నామని చెప్పారు. నవతరానికి కొలువుల జాతరతో కొత్త ఊపిరి పోశామన్నారు. రుణమాఫీతో రైతన్నకు

...:: మిగతా 2లో

గ్లోబల్ సమ్మిట్‌కు సర్వం సిద్ధం

ఏర్పాట్లు పూర్తి చేసిన ప్రభుత్వం



- భారీగా పెట్టుబడులకు ఆహ్వానం
- ప్రభుత్వ సహకారంపై చర్చ
- హాజరుకానున్న ప్రపంచ దేశాల ప్రతినిధులు
- నేటి మధ్నాహ్నం సదస్సును ప్రారంభించనున్న గవర్నర్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్7: నేటి మధ్నాహ్నం ఒకటిన్నరకుగవర్నర్ జిష్ణు దేవ్ వర్మ లాంఛనంగా సమ్మిట్ ను ప్రారంభిస్తారు. సుమారు రెండు వేల మంది దేశ, విదేశీ అతిథులు ప్రారంభవేడుకకు హాజరవుతున్నారు. సమ్మిట్ లో వివిధ అంశాలపై నోబెల్ బహుమతి గ్రహీత అభిజిత్ బెనర్జీ, ట్రంప్ మీడియాటెక్నాలజీ గ్రూప్ సీఈఓ ఎరిక్ స్వైడర్, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సీఈవో జెరెమీ జుర్గెన్స్, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి, బయోకాన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్‌షా, తదితరులు ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం రెండున్నర గంటలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు. తెలంగాణలో ప్రజాపాలన, పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వంవైపు నుంచి అందించే సహకారం, విజన్ 2047 డాక్యుమెంట్ లక్ష్యాలు, భారత్ ఫ్యూచర్ సిటీపై ముఖ్యమంత్రి ఆహుతులకు వివరిస్తారు. రెండు రోజుల్లో మొత్తం 27 అంశాలపై సెషన్లు జరుగుతాయి. ఇందుకు

...:: మిగతా 2లో



వందేమాతరం @ 150

జాతీయ గీతం వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా లోక్‌సభలో సోమవారంనాడు ప్రత్యేక చర్చ జరుగనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ చర్చను ప్రారంభిస్తారు.

7



1650కి పైగా విమానాలు నడుస్తున్నాయ్

ఇండిగో సంక్షోభం నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్నది. సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇటీవల సంక్షోభం నేపథ్యంలో పరిస్థితిని మెరుగుపరిచేందుకు కంపెనీ చర్యలు చేపట్టింది.

7

సంక్షేమానికి కేరాఫ్ కాంగ్రెస్

ప్రజలకు ఇచ్చిన ప్రతిహామీని నిలబెట్టుకుంటున్నాం

- సంక్షోభంలో రాష్ట్రాన్ని అప్పగించారు
- రెండేళ్లలో సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దాం
- రెండేళ్ల పాలనపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో



హైదరాబాద్, డిసెంబర్ 7:- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఏ వర్గాన్ని విస్మరించకుండా అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతనిస్తూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అభివృద్ధి సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే దిక్సూచిగా నిలిచిందన్నారు. రెండేళ్ల పాలనకు ప్రజా ఆమోదం సంపూర్ణంగా ఉందని, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఫలితాలే ఇందుకు నిదర్శనమన్నారు. ఆదివారం తనను కలిసిన విలేకరులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'రెండేళ్లు పూర్తి చేసుకుని మూడో వసంతంలోకి అడుగుపెడుతున్నాం.. రెండేళ్ల కాలం మరీ తక్కువే కానీ ప్రభుత్వం సాధించిన విజయాలు మాత్రం అత్యద్భుతం. ధనిక రాష్ట్రాన్ని తమ స్వార్థపూరిత నిర్ణయాలతో పదేళ్లలో దివాలా తీశారు. ఆర్థిక సంక్షోభంలో రాష్ట్రాన్ని అప్పగిస్తే రెండేళ్లలోనే సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దాం' అని అన్నారు. ఎక్కడలేని ఎవరూ ఊహించని అభివృద్ధి సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసి వాటిని దిగ్విజయంగా అమలు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టామని, వీటిలో నాలుగు గ్యారంటీలను అమలు చేశామని అన్నారు. మిగిలిన రెండు గ్యారంటీలలో కొన్నింటిని పాక్షికంగా అమలు చేశామన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఈ రెండు గ్యారంటీలను పూర్తిగా అమలు చేయలేదని, అయినా

...:: మిగతా 2లో



ప్రతి ప్రాంతంలోనూ మౌలిక సదుపాయాల లేమి

- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై కవిత ఫైర్
- ప్రజల సమస్యలపై గట్టిగా అడగడం వల్లే సస్పెన్షన్
- అయినా ప్రజల కోసం పోరాటం ఆగదు
- మేడ్చల్‌లో జాగృతి జనంబాట

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 7: ఎక్కడ చూసినా మౌలిక సదుపాయాల లేమితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.. ప్రభుత్వ నిర్లక్ష్యం, రెవెన్యూ సమస్యలు, విద్య, వైద్యం, నీరు, రోడ్లు ఇలా అన్నీ సమస్యలే అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మేడ్చల్ జిల్లా పరిధిలోని నాగారం, దమ్మాయి గూడ, భవానీనగర్, జవహర్ నగర్, లక్ష్మాపూర్, ఆలియాబాద్ ప్రాంతాల్లో జాగృతి జనంబాట కార్యక్రమంలో ప్రజలతో కలిసిమెలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. నాగారం, దమ్మాయి గూడలో కవిత మాట్లాడుతూ ఇక్కడ మౌలిక అవసరాల పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గతంలో రేవంత్ రెడ్డి, మల్లారెడ్డి వంటి పలువురు నేతలు వచ్చినా సమస్యలు మాత్రం అలాగే ఉన్నాయన్నారు. డ్రైనేజీ మంజూరు అయినట్లయినా వెంటనే పనులు ప్రారంభించాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. ఇక్కడ పెరిగిన జనాభాకు ఒక రేషన్ షాప్, బస్తీ దవాఖానా, ప్రాథమిక పాఠశాల కూడా లేకపోవడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేసిన ఆమె, చిన్నపిల్లలు ప్రధాన రహదారి దాటి పాఠశాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. వర్షకాలంలో ముంపుతో ప్రజలు బయటకు రావడం కూడా కష్టమైపోతుందని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. మిషన్ భగీరథ పైప్‌లైన్లు ఉన్నప్పటికీ వారానికి ఒకసారి కూడా మంచినీరు రాకపోవడం పట్ల

...:: మిగతా 2లో



ప్రయాణికులకు రూ. 610 కోట్లు రీఫండ్

ఇండిగో విమాన సర్వీసుల్లో వారం రోజులుగా అంతరాయాలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ అంశంపై దృష్టి సారించిన కేంద్రం.. ప్రయాణికులకు టిక్కెట్ డబ్బులను రీఫండ్ చేయాలని ఇప్పటికే స్పష్టం చేసింది.

7



రాష్ట్రంలో భూదందాలు

- దందాల కోసం మంత్రులు పోటీలు పడుతన్నారు
- ఏం చేశారని విజయోత్సవాలు చేస్తున్నారు?
- సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు జవాబు చెప్పాలి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంచలన కామెంట్స్
- నల్గొండ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం

ప్రతిపక్షం, నల్గొండ

డిసెంబర్7: సింగరేణి భూముల నుంచి మొదలు హైటెక్ సిటీ భూముల వరకు రాష్ట్రంలో విపరీతమైన అక్రమ భూదందా నడుస్తున్నదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ పార్టీ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. గతంలో కేటీఆర్ఎలాగైతే కేంద్రీకృతమైన వసూళ్లకు పాల్పడ్డాడో.. ల్యాండ్ బిజినెస్‌గానీ, రియలెస్టేట్ లో గానీ.., ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దలు అలాగే దందాలు చేస్తున్నారు. దందాలకోసం మంత్రులు పోటీలు పడుతన్నారని అన్నారు. ఇండ్ల పర్మిషన్ కోసం ఎన్వోసీ ఇవ్వడం కోసం ఇబ్బందులు ఎదురవుతున్నాయని, హైదరాబాద్‌లో రియలెస్టేట్ కుప్పకూలిపోయిందని, కృత్రిమ వేలం పెట్టి రియలెస్టేట్‌వ్యాపారం పెరిగిందని చూపించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున భూములు అమ్మిందని, ఇప్పుడు కాంగ్రెస్‌అదే పనిచేస్తోందన్నారు. భూములు, బీరు, బ్రాంది అమ్మకుండా ఈ ప్రభుత్వం


...:: మిగతా 2లో



లియోనల్ మెస్సి పుట్బాల్ మ్యాచ్‌కు దేశం నలుమూలల నుంచి అభిమానులు

- మ్యాచ్ నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

...:: వివరాలు 3లో



గోవా ప్రమాదంపై ఎఫ్ఐఆర్

గోవా లోని బిర్చ్ నైట్ క్లబ్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగి 25 మంది ప్రాణాలు కోల్పోవడంపై పోలీసులు చర్యలకు దిగారు. నైట్‌క్లబ్ యజమానులు సౌరభ్ లూత్రా, గౌరవ్ లూత్రాలపై భారతీయ న్యాయసంహితలోని వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

7

ప్రతిపక్షం
Prathipaksham.in
2
హైదరాబాద్
సోమవారం
08.12.2025
@prathipaksham
prathipakshamtvtelugu

రాష్ట్రీయం

హైదరాబాద్‌లో ట్రంప్ ఎవెన్యూ, గూగుల్ స్ట్రీట్

- అంతర్జాతీయ టెక్ కంపెనీల పేర్లపై రోడ్లు
- ఫ్యూచర్ సిటీ ప్రధాన రోడ్డుకు రతన్ టాటా పేరు
- సీఎం రేవంత్ రెడ్డి వినూత్న ప్రతిపాదన



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్7: తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నేపథ్యంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి వినూత్న ప్రతిపాదనతో ముందుకు వచ్చారు. ఇప్పటికే అంతర్జాతీయ ఖ్యాతి గడించిన హైద రాబాద్ కు మరింతగా గ్లోబల్ మ్యాప్ లో చోటు కల్పించేలా సీఎం సంకల్పించారు. అందుకు అనుగుణంగా ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తులు, కంపెనీల పేర్లను హైదరాబాద్ లో ప్రధాన రహదారులకు పెట్టాలని నిర్ణయించారు. నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్ వద్ద రావిర్యాలను నుంచి ప్రారంభమై ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీని అనుసంధానం చేసే 100 మీటర్ల గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డుకు పద్మభూషణ్ రతన్ టాటా పేరు పెట్టాలని నిర్ణయించారు. రావిర్యాల ఇంటర్‌చేంజ్‌కు ఇప్పటికే "టాటా ఇంటర్‌చేంజ్" అని పేరు పెట్టారు. అలాగే ప్రపంచంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ ముందు నుంచే వెళ్లే ప్రధాన రహదారికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరుతో "డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ" అని నామకరణం చేయాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఈ నిర్ణయంపై కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖకు, అమెరికా రాయబార కార్యాలయానికి ప్రభుత్వం లేఖ రాయనుంది.

మరిన్ని ప్రధాన రహదారులకు గ్లోబల్ దిగ్గజ కంపెనీల పేర్లు

ఢిల్లీలో ఇటీవల జరిగిన యూఎస్,ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరమ్ వార్షిక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన ప్రకారం, హైదరాబాద్‌లోని ముఖ్య రహదారులకు ప్రముఖ అంతర్జాతీయ కంపెనీల పేర్లు పెట్టాలన్న దృష్టిలో భాగంగా మరిన్ని ప్రతిపాదనలు ఉన్నాయి. గ్లోబల్ టెక్ దిగ్గజం గూగుల్ సేవలను గుర్తిస్తూ ఒక ముఖ్య రహదారిని "గూగుల్ స్ట్రీట్" అని ప్రకటించేందుకు ప్రణాళిక చేశారు. మైక్రోసాఫ్ట్ రోడ్, విప్రో జంక్షన్ పేర్లను కూడా పరిశీలిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రభావితవ్యక్తులు, ప్రముఖ కంపెనీల పేర్లను రహదారులకు పెట్టడం ద్వారా వారికి సముచిత గౌరవం ఇవ్వటంతో పాటు, హైదరాబాద్ కు అంతర్జాతీయ గుర్తింపు వస్తుందని సీఎం భావిస్తున్నారు. అలాగే ఆ రోడ్లపై ప్రయాణించి వారికి కూడా స్ఫూర్తిమంతంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి ఈ ప్రతిపాదన చేశారు.

బౌద్ధానికి తెలంగాణ ప్రధాన కేంద్రం

- తెలంగాణ పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు
- ఆసియా, బౌద్ధ దేశాల రాయబారులతో సమావేశం



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 7: ఆసియా, బౌద్ధ దేశాలు, ఇతర విదేశీ రాయబారులు, హైకమిషనర్లతో తెలంగాణ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హైదరాబాద్ ట్రైడెంట్ హోటల్‌లో ఆదివారం సమావేశమయ్యారు. తెలంగాణ బౌద్ధ వారసత్వం, అంతర్జాతీయ పర్యాటక-సాంస్కృతిక భాగస్వామ్యాలపై చర్చించారు. దక్షిణ భారతదేశంలో మహాయాన బౌద్ధానికి తెలంగాణ ప్రధాన కేంద్రంగా ఉందని, గోదావరి, కృష్ణా పరివాహక ప్రాంతాల్లో బౌద్ధం పరిఢవిల్లిందని తెలంగాణకు ఉన్న చారిత్రక నేపథ్యాన్ని మంత్రి వివరించారు. నాగార్జునకొండ, ఫణిగిరి, ధూలికట్ట, నెలకొండపల్లి, కోటిలింగాల వంటి బౌద్ధ కేంద్రాల ప్రాముఖ్యతను రాయబారులకు వివరించారు. నాగార్జునసాగర్‌లో నిర్మాణం జరుగుతున్న బుద్ధవనం బౌద్ధ హెరిటేజ్ థీమ్ పార్క్ ను ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్టు తెలియజేశారు. బుద్ధుడి జీవిత చరిత్ర, బోధనలు తదితర సమస్త సమాచారంతో కూడిన బుద్ధవనం ప్రపంచ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా భాసిల్లుతుందని అన్నారు. సర్వజన సంక్షేమం, ప్రేమ, శాంతి, సహజీవనంలతో కూడిన ప్రగతి దిశగా గౌతమ బుద్ధుడి మార్గంలో రాష్ట్ర ప్రభుత్వం పయనిస్తుందని చెప్పారు. భవిష్యత్ తరాలకు బౌద్ధ ధర్మాన్ని పరిచయం చేసే చేసే జీవశిల్పంగా నిలిచిపోతుంది. రాష్ట్రంలోని బౌద్ధ వారసత్వ కేంద్రాలను పునరుద్ధరణకు తెలంగాణ ప్రభుత్వ చేస్తున్న కృషిని వారు అభినందిస్తూ, భవిష్యత్‌లో సాంస్కృతిక, పర్యాటక, పెట్టుబడి రంగాలలో సహకారానికి ఆసక్తిని వ్యక్తం చేశారు. రాబోయే 'తెలంగాణ రైజింగ్ - 2047 గ్లోబల్ సమ్మిట్' (డిసెంబర్ 8-9, భారత్ ఫ్యూచర్ సిటీ)లో పాల్గొనాలని మంత్రి రాయబారులను ఆహ్వానించారు.

డిసెంబర్ 9న ఘనంగా 'విజయ్ దివస్'

- ప్రతి నియోజకవర్గ కేంద్రంలో సంబరాలు: కేటీఆర్ పిలుపు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్ డిసెంబర్ 7: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో కీలక మలుపు తిరిగిన డిసెంబర్ 9వ తేదీని 'విజయ్ దివస్'గా ఘనంగా నిర్వహించుకోవాలని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం పార్టీ ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన దిశానిర్దేశం చేశారు. కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు తలొగ్గి, కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిన రోజే డిసెంబర్ 9 అని కేటీఆర్ గుర్తుచేశారు. నవంబర్ 29న 'దీక్షా దివస్'ను విజయవంతం చేసినట్లే, కేసీఆర్ 11 రోజుల దీక్ష ఫలించిన డిసెంబర్ 9ని విజయం సాధించిన రోజుగా.. 'విజయ్ దివస్' పేరుతో పండుగలా జరుపుకోవాలని ఆయన సూచించారు. డిసెంబర్ 9 రోజే 60 సంవత్సరాల తెలంగాణ ఆకాంక్షకు కేసిఆర్ ఆమరణ నిరాహార దీక్ష వలన ఒక రూపం వచ్చిందని కేటీఆర్ అన్నారు. అంతటి ఘనమైన చారిత్రక ఘట్టాన్ని మరోసారి స్మరించుకుంటూ, ఆనాడు కెసిఆర్ గారు తెలంగాణ కోసం చేసిన త్యాగాన్ని గుర్తుచేస్తూ, ప్రత్యేక రాష్ట్ర ప్రకటన సిద్ధించిన రోజును సంబరంగా నిర్వహించుకోవాలని సూచించారు.



రెండేళ్ల సంబరాలు..

నేటితో తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి రెండు సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా గాంధీ భవన్లో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేశాయి. ఈ సందర్భంగా తెలంగాణ ఫిషరీస్‌చైర్మన్‌మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకొని కాంగ్రెస్ కార్యకర్తలు వేడుక చేశారు.

- ప్రతిపక్షం, హైదరాబాద్

హైదరాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు యువకులు మృతి



ప్రతిపక్షం, స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబరు7: హైదరాబాద్‌లో మరో ఘోర ప్రమాదం జరిగింది. లాలాగూడ పీఎస్ పరిధి లాలాపేటలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అత్యంత వేగంతో వచ్చి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది.ఈ ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో గాయపడిన మరో ఇద్దరు యువకులను హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. మృతిచెందిన వారు మల్కాజిగిరికి చెందిన హర్షిత్ రెడ్డి(22), చెంగిచర్లకు చెందిన శివమణి (23)గా గుర్తించారు. నలుగురు స్నేహితులు కీసర నుంచి తార్నాకాకు టిఫిన్ చేసేందుకు వెళ్తుండగా ఈఘటన జరిగింది. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో ఈ ఘోర ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదం జరగడంతో లాలాపేటలో ట్రాఫిక్ స్థంభించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



"బెంగళూరు చిన్నస్వామి స్టేడియం నుంచి ఐపీఎల్ మ్యాచ్‌లను పుణేకు తరలించడానికి అనుమతించేది లేదు. ఇది కర్ణాటక రాష్ట్ర, బెంగళూరు గౌరవానికి సంబంధించిన విషయం. భవిష్యత్తులో ఎలాంటి తొక్కిసలాటలు జరగకుండా చూస్తాం. బెంగళూరులో కొత్త క్రికెట్ స్టేడియం కూడా నిర్మిస్తాం.

- కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

..గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరో లెక్క

మొదటిపేజీ తరువాయి

వెన్నుదన్నుగా నిలిచామని స్పష్టం చేశారు. బలహీనవర్గాల ఆకాంక్షలను కులగణనతో కొత్త మలుపు తిప్పామని ధీమా వ్యక్తం చేశారు. వర్గీకరణతో మాదిగ సోదరుల ఉద్యమాన్ని సార్థకత చేశామని గుర్తు చేశారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్ల నిర్మాణం సహా, స్కిల్, స్పోర్ట్స్ యూనివర్సిటీలకు శ్రీకారం చుట్టామని వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీ రేపటి తెలంగాణ ప్రగతికి వేగుచుక్క అని అభివర్ణించారు. నిన్నటి వరకు ఒక లెక్క.. గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరోలెక్క అని సీఎం రేవంత్ వెల్లడించారు.

సీఎంగా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు

సోమవారం నుంచి రెండు రోజుల పాటు తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ జరగనుంది. ఈ సమ్మిట్‌ను తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించనున్నారు. సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఈ సమ్మిట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించనున్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో వివిధ అంశాలపై 27 సెషన్లలో చర్చలు జరగనున్నాయి. గ్లోబల్ సమ్మిట్‌కు 44 దేశాల నుంచి 154 మంది ప్రతినిధులు, అతిథులు హైదరాబాద్‌కు తరలి రానున్నారు. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ పరిసర ప్రాంతాలో దాదాపు ఆరు వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెంబర్ 14 నుంచి గ్లోబల్ సమ్మిట్ వేదిక వరకు భారీగా పోలీసులు మోహరించారు. 2023 నవంబర్‌లో తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దాంతో పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు ఫుల్ స్టాప్ పడింది. దీంతో అదే ఏడాది డిసెంబర్ 7వ తేదీన తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన సీఎంగా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తి కానుంది.

సంక్షేమానికి కేరాఫ్ కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి

వాటిని ప్రజలకు అందించేందుకు ప్రయత్నిస్తామని అన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో గణనీయమైన ప్రగతిని సాధిస్తున్నామని, ఆర్థికవృద్ధిలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని భారత దేశంలోనూ, ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు సీఎంరేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. ఒకవైపు ప్రపంచ నగరాలతో పోటీ పడే లక్ష్యాలను నిర్దేశించుకొని, మరోవైపు పేదల ఆకాంక్షలు తీర్చే సంక్షేమ ఫలాలు అందిస్తూ, ద్విముఖ వ్యూహంతో మా ప్రభుత్వం పాలన సాగిస్తోందని మంత్రి అన్నారు.

కాంగ్రెస్ పాలనపై ప్రజలకు పూర్తి సంతృప్తి..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజలకు పూర్తి సంతృప్తి ఉందన్న విషయం ఇప్పటివరకు జరిగిన ఉప ఎన్నికలే రుజువు చేస్తున్నాయి. హైదరాబాద్‌లో తొలిసారి జరిగిన కంటోన్మెంట్ ఉప ఎన్నికలతో పాటు ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ విజయమే దీనికి నిదర్శనం అని అన్నారు. రాష్ట్రంలో ఈ రెండేళ్లలో రెవెన్యూ, హౌసింగ్, సర్వే తదితర విభాగాలలో విప్లవాత్మక మార్పుల తీసుకువచ్చామని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో భూ సమస్యలను వీలైనంతవరకు తగ్గించడం, అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం తమ ప్రభుత్వం ముందున్న ప్రథమ లక్ష్యమన్నారు.

గ్లోబల్ సమ్మిట్‌కు సర్వం సిద్ధం

మొదటిపేజీ తరువాయి

వీలుగా సెమినార్ హాళ్లను అధికారులు సిద్ధం చేశారు. అంతర్జాతీయ, దేశీయ అతిథులు, పెట్టుబడిదారులకు తెలంగాణతో పాటు హైదరాబాద్ ప్రత్యేకతలు తెలిసేలా ప్రచార సామగ్రిని సిద్ధం చేశారు. ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలో వేదిక వరకు వివిధ రూపాల్లో వీటి ప్రదర్శన ఉంటుంది. అలాగే హైదరాబాద్ వ్యాప్తంగా అత్యాధునిక టెక్నాలజీ తో ప్రత్యేకంగా ప్రచార ఏర్పాట్లు జరిగాయి. లైటింగ్ ప్రొజెక్షన్, 3డీ ప్రొజెక్షన్ మ్యాపింగ్, ఎయిర్ పోర్టు అప్రోచ్ రోడ్ లో ఎల్ఈడీ స్క్రీన్స్ తో ఈ విభిన్న ప్రదర్శనలు ఉంటాయి. సబ్జెక్టులపై చర్చల తర్వాత ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణి సంగీత కచేరి అతిథులను అలరించనుంది. అలాగే తెలంగాణ ప్రత్యేక నృత్య రూపాలైన కొమ్ముకోయ, బంజారా, కోలాటం, గుస్సాడీ, ఒగ్గు డొల్లు, పేరిణి నాట్యం, బోనాల ప్రదర్శనతో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుంది. మరోవైపు నాగార్జున సాగర్ దగ్గర ఉన్న ప్రపంచంలోనే అతి పెద్ద వారసత్వ బౌద్ధ థీమ్ పార్కు అయిన బుద్ధవనం పర్యటనకు దౌత్యబృందం వెళ్లేలా టూరిజం శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సదస్సు జరిగే రెండు రోజుల పాటు హాజరైన అందరికీ పసందైన హైదరాబాదీ బిర్యానీతో పాటు, తెలంగాణ ప్రసిద్ధ వంటలతో భోజనాలను అందించేందుకు వంటశాలలు సిద్ధమయ్యాయి. ఇక అతిథులను తెలంగాణ పర్యటన ఎప్పటికీ గుర్తుండిపోయేలా గ్లోబల్ సమ్మిట్ డెలిగేట్లకు ప్రత్యేక సావనీర్లకు కూడిన బహుమతిని ప్రభుత్వం తరపున అందించనున్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లోగో పాటు, పోచంపల్లి ఇక్కత్ శాలువా, చేర్యాల కళాకృతులు, హైదరాబాదీ అత్తర్, ముత్యాలతో కూడిన నగలను ఈ సావనీర్ లో పొందుపరుస్తారు. అలాగే తెలంగాణకే ప్రత్యేకమైన వంటలైన ఇప్ప పువ్వు లడ్డు, సకినాలు, చెక్కలు, బాదం కీ జాలి, నువ్వుల ఉండలు, మక్క పేలాలతో కూడిన మరో ప్రత్యేక బాస్కెట్ ను కూడా అతిథులకు అందించనున్నారు.

రాష్ట్రంలో భూదందాలు

మొదటిపేజీ తరువాయి

ఒక్క రోజు కూడా పని చేసే పరిస్థితి లేదని, ఎవరి సంక్షేమం కోసం మద్యం విక్రయాలను పెంచి పోషిస్తున్నరో చెప్పాలని అన్నారు.

ఏం సాధించారని విజయోత్సవాలు

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై రెండేండ్లు పూర్తవుతున్న సందర్భంగా విజయోత్సవాల పేరిట సీఎం రేవంత్‌రెడ్డి అనేక ప్రాంతాల్లో పర్యటిస్తున్నారని, మరి రెండేండ్లలో ఏం చేశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలో ఏ ఒక్కటి అమలు కావడం లేదని, ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారని, ఈ రెండేండ్ల పాలన పూర్తవుతున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నానని అన్నారు. ఒక్క సింగరేణి సంస్థకే రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థల ద్వారా దాదాపు రూ.42 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని అన్నారు. ఇండిగో విమానాలు రద్దు విషయంపై కేంద్రం ఇప్పటికే స్పందించిందని, ఆ కంపెనీ తీరుపై దర్యాప్తు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి బీజేపీ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీలో పెట్టిన బిల్లుకు మద్దతు తెలిపిందని,. దీనిపై దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదరాల్సిన అవసరం ఉన్నదని అన్నారు.

ప్రతి ప్రాంతంలోనూ మౌలిక సదుపాయాల లేమి

మొదటిపేజీ తరువాయి

ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ, పైప్‌లైన్ అమలు సాధ్యం కాని చోట ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని సూచించారు.

ప్రజల సమస్యలపై గట్టిగా అడగడం వల్లే సస్పెన్షన్

భవానీనగర్ పర్యటనలో కవిత వ్యక్తిగత రాజకీయ పరిణామాలను కూడా ప్రస్తావించారు. దమ్మాయి గూడలో తమ మేనమామ ఉండేవారని, అప్పట్లో ఎలా ఉందో ఇప్పటికీ పరిస్థితి అలాగే ఉందని చెప్పారు. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలోనూ, కాంగ్రెస్ రెండేళ్లపాలనలోనూ మార్పు లేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రజల సమస్యలపై గట్టిగా అడగడం వల్లే బీఆర్ఎస్ పార్టీ నుంచి తనను సస్పెండ్ చేశారని, అయినప్పటికీ ప్రజల కోసం పోరాటం ఆపబోనని అన్నారు. 19 ఏళ్లుగా జాగృతి తరఫున బతుకమ్మ, బోనాలు, యువత-మహిళల కోసం పనిచేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇక్కడ రేషన్ షాప్, స్కూల్, బస్తీ దవాఖానా ఏవి లేకపోవడం, కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ వల్ల ఇళ్లలో షాక్ సమస్యలు రావడం వంటి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందని అన్నారు. రేవంత్ రెడ్డి గతంలో చేసిన హామీలు ఒక్కటూ నెరవేరలేదని, నాలాను అద్దంలా మెరుస్తానని మాట ఇచ్చినా ఇప్పటి వరకు ప్రారంభం కాలేదని విమర్శించారు. పెన్షన్ పెంపు, తులం బంగారంతో సహా ఇచ్చిన హామీలు అన్నీ గాలికే అన్నట్టయ్యాయని ఆమె పేర్కొన్నారు.

ఇక్కడ ఎక్కడ చూసినా సమస్యలే...

జవహర్ నగర్ పర్యటనలో కవిత మాజీ మంత్రి మల్లారెడ్డి చేసిన అభివృద్ధి వాదనలను తప్పుబట్టారు. మేడ్చల్‌ను అభివృద్ధి పథంలో నడిపినట్లు ఆయన చెప్పినా, ఇక్కడ ఎక్కడ చూసినా సమస్యలే కనబడుతున్నాయని అన్నారు. మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తాగునీరు, రోడ్లు, కరెంట్, స్కూళ్లు, ఆసుపత్రుల కోసం ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. మేడ్చల్ ప్రైవేట్ ఎడ్యుకేషన్ హబ్, గంజాయి అడ్డాగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డంప్ యార్డు సమస్య కాంగ్రెస్ ప్రభుత్వంలో మరింత పెరిగిందని, బీఆర్ఎస్ కాలంలో వచ్చిన కొద్దిపాటి ఉపశమనం మళ్ళీ నష్టపోయిందని అన్నారు. మల్లారెడ్డి భూమి కబ్జాలు, రోడ్డు విస్తరణకు ఆటంకాలు, ఆయన కాలేజీలు-యూనివర్సిటీలు తప్ప ప్రజలకు ఉపయోగం లేదని వ్యాఖ్యానించారు. 58, 59 జీవోల కింద ప్రజలు డబ్బులు చెల్లించినా రిజిస్ట్రేషన్లు జరగకపోవడం, అయితే మల్లారెడ్డి మరియు మేయర్ భూముల రిజిస్ట్రేషన్లు జరిగాయని ఆరోపించారు. దీనిపై సుప్రీంకోర్టు వరకు పోరాటం చేస్తామని కవిత గారు ప్రకటించారు. చింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో రైతులను కలిసి కవిత అక్కడి రెవెన్యూ సమస్యలను వివరంగా విన్నారు. వందేళ్లుగా గ్రామ నక్ష సరిగా లేకపోవడంతో భూములపై అస్తవ్యస్తమైన రికార్డులు ఉన్నాయని, కేసీఆర్ కూడా గతంలో దీన్ని సరిచేస్తామని మాట ఇచ్చారని చెప్పారు. ధరణి వల్ల సమస్యలు మరింత పెరిగాయని, శాటిలైట్ సర్వేలలో భారీ అవకతవకలు జరిగి రైతు భరోసా పూర్తిగా రాకపోవడం, ఎకరాల లెక్కలు తారుమారుకావడం, లవణి భూములుగా నమోదు కావడం వంటి సమస్యలు వచ్చినట్లు వివరించారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి రెండేళ్లు అయినా పాస్‌బుక్కులు, రైతు భరోసా రాకపోవడం దురదృష్టకరమన్నారు. లక్ష్మాపూర్ రెవెన్యూ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

'నా బాట ముళ్ల బాట'..

ఆలియాబాద్‌లో కవిత అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. మహిళలతో మాట్లాడి వారి సమస్యలు విన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "నా బాట పూల బాట కాదు.. ముళ్ల బాటనే. అయినప్పటికీ ప్రజల ఆశీర్వాదం ఉంటే తప్పకుండా మేలు చేస్తానని నమ్ముతున్నా," అన్నారు. 20 ఏళ్లు పనిచేసిన పార్టీ నుండి బయటకు పంపినా, ప్రజల కోసం పోరాటం ఆపబోవటంలేదని స్పష్టం చేశారు. జాగృతి జనం బాటలో రాష్ట్రమంతా తిరుగుతూ సమస్యలు తెలుసుకుంటున్నామని, ఎక్కడ సమస్యలు చెబుతామో అక్కడ పరిష్కారాలు కనిపిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం నాయకులు ఎన్నికలతో బిజీగా ఉండగా, తాము మాత్రం ఓట్ల కోసం కాకుండా ప్రజల సమస్యల కోసం వస్తున్నామని అన్నారు.

అభివృద్ధిని పక్కనపెట్టి, విధ్వంసపాలన

- రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై విమర్శలు వెల్లువ
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల వ్యాఖ్యలు
- తెలంగాణ నాలెడ్జ్ క్రియేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో సమావేశం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 7: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లుగా ప్రజలను మోసగిస్తూ, అభివృద్ధిని పక్కనపెట్టి, విధ్వంసపాలన కొనసాగిస్తోందని వక్తలు తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ నాలెడ్జ్ క్రియేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో సోమాజిగూడలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు కాంగ్రెస్ పాలనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన డైరెక్టర్ గోసుల శ్రీనివాస్ యాదవ్ సమక్షంలో ప్రసంగించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎరోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, "ప్రజలకు పాట్లు, ప్రతిపక్షాలకు తిట్లు, దేవుడిపై ఒట్లు, అనునయులకు నోట్లు.. ఇదే రెండేళ్ల కాంగ్రెస్ పాలన" అన్నారు. రెండేళ్ల పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను రాజేస్తూ ఆయన గురుకులాల్లో పిల్లల మరణాలు, రైతుల ఆత్మహత్యలు, అమలుకాని ఆరు గ్యారెంటీలు, 420 హామీలు రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టాయని మండిపడ్డారు. "రేవంత్ రెడ్డికి ధైర్యం ఉంటే ఒక్క గ్యారెంటీ అయినా పూర్తిగా అమలైందో చెప్పాలి" అని సవాల్ విసిరారు.

కాంగ్రెస్ నేతల ఆస్తులే రైజింగ్: ఎరోళ్ల శ్రీనివాస్

పేదలు, రైతులు, నిరుద్యోగులు సమస్యల్లో కూరుకుపోతున్న వేళ, కాంగ్రెస్ నేతలు, వారి సన్నిహితుల ఆస్తులే పెరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. కీలక శాఖలకు మంత్రులు లేకపోవడం పాలన పతనానికి నిదర్శనమన్నారు. డ్రగ్స్ కేసును బయటపెట్టడంలో పోలీసులు విఫలమయ్యారని విమర్శించారు.

హైదరాబాద్‌ను కేంద్రానికి అప్పగించే కుట్ర: పల్లె రవికుమార్

కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి పాలన తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బతీసేలా ఉందని, హైదరాబాద్‌ను కేంద్రానికి అప్పగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో ఉద్యమకారులనే ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణం: వెంకట్ రెడ్డి

ఎంవీ ఫౌండేషన్ కన్వీనర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, రెండు ఏళ్లలో ప్రభుత్వ పాఠశాలల నుంచి లక్షలాది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశాఖ, హోంశాఖ మంత్రులు లేకపోవడం విద్యా వ్యవస్థను దెబ్బతీసిందని అన్నారు.

టీఎస్ పాలనకు గ్రహణం: సుమిత్రానంద

టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద మాట్లాడుతూ, మహిళలు, విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలు ఏవీ అమలుకాలేదని విమర్శించారు. "అబద్దానికి అంగీలాగు తొడిగితే రేవంత్ రెడ్డి" అని వ్యాఖ్యానించారు.

పబ్లిసిటీ ఫుల్, పరిపాలన నిల్: వాసుదేవ రెడ్డి

వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలనలో పరిపాలన పూర్తిగా స్తంభించిపోయి, ప్రచారమే ప్రధానమైందని అన్నారు. తెలంగాణ గుర్తింపును అవమానపరిచే చర్యలు జరుగుతున్నాయని అన్నారు.

సంక్షోభంలో రాష్ట్రం : ప్రొఫెసర్ పాపారావు

ప్రొఫెసర్ పాపారావు మాట్లాడుతూ, గ్రామాల నుంచి నగరాల వరకూ అభివృద్ధి ఆగిపోయి, పథకాలు నిలిచిపోవడంతో ప్రజలందరూ కష్టాల్లో ఉన్నారని అన్నారు. "ఆరు గ్యారెంటీలు, 420 హామీలు మోసపూరితమే" అన్నారు.

రెండేళ్ల కాంగ్రెస్ నయవంచన పాలన

- కాంగ్రెస్ పాలనపై నిప్పులు చెరిగిన బీజేపీ నేతలు
- రైజింగ్ తెలంగాణ కాదు.. అవినీతి తెలంగాణ :ఎంపీ లక్ష్మణ్
- కాంగ్రెస్ త్వరలో ఇంటికే: తెలంగాణ బీజేపీ చీఫ్



ప్రతిపక్షం, స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 7: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనపై బీజేపీ నేతలు నిప్పులు చెరిగారు. ఆదివారం హైదరాబాద్‌లో ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. రెండేళ్ల కాంగ్రెస్ నయవంచన పాలన పేరుతో.. కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చని హామీలతో కూడిన ఛార్జ్‌షీట్‌ను ఈ కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి పాలన.. వంచన పాలన తప్పితే మరొకటి కాదని మండిపడ్డారు. 420 హామీలతో రేవంత్ రెడ్డి.. రాష్ట్రంలో అన్ని సామాజిక వర్గాలను వంచించారని విమర్శించారు. ఈ హామీలపై తెలంగాణ ప్రజలతోపాటు బీజేపీ సైతం ప్రశ్నిస్తోందని స్పష్టం చేశారు. ప్రశ్నిస్తున్న సమాజానికి సమాధానం చెప్పాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఆయన సూచించారు. రైజింగ్ తెలంగాణ అంటే ఏమిటో చెప్పాలంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన డిమాండ్ చేశారు. రైజింగ్ తెలంగాణ.. డ్రగ్స్ కల్చర్‌గా మారిపోయిందని, గన్ కల్చర్ పెరిగిపోయిందంటూ ఆరోపించారు. రైజింగ్ తెలంగాణ కాదు ఇది అవినీతి తెలంగాణ అంటూ ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. రెండేళ్లలో రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టుకోలేని భయాందోళనలో కంపెనీలు ఉన్నాయని వివరించారు. గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులు పాపాలుగా మారి ప్రజలను పీడిస్తున్నాయన్నారు. అప్పులు పుట్టడం లేదు, చెప్పులు ఎత్తుకు పోయేలా చూస్తున్నారని చెప్పిన రేవంత్.. నేడు గ్లోబల్ సమ్మిట్ పేరుతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నామంటే నమ్ముతారా..? అంటూ సందేహం వ్యక్తం చేశారు. రేవంత్ సర్కార్‌ను అడుగడుగునా నిలదీసేందుకు సంసిద్ధం కావాలని ప్రజలకు లక్ష్మణ్ పిలుపు నిచ్చారు.

కాంగ్రెస్ త్వరలో ఇంటికే: తెలంగాణ బీజేపీ చీఫ్

కాంగ్రెస్‌ను గద్దె దించే వరకు బీజేపీ పోరాటం చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీల్లో ఒక గ్యారంటీ కూడా ఈ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. ఆరోగ్య శ్రీ బకాయిలు ఇంత వరకు ఎందుకు విడుదల చేయలేదంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఆయన సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో మాఫియా చేతిలో ల్యాండ్ ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్యులకు మిగిలేది శూన్యమన్నారు. మత రాజకీయాలు చేస్తున్నారంటూ కాంగ్రెస్ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి మూడు కోట్ల మంది దేవుళ్లు ఉంటే.. కాంగ్రెస్ పార్టీకి ముగ్గురే దేవుళ్లని.. వారే సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలంటూ వ్యంగ్యంగా వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి హిందువులపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మత విద్వేషాలు పెరుగుతున్నాయన్నారు. దేశ ద్రోహులను పోషిస్తుందంటూ కాంగ్రెస్ పార్టీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్బన్ నక్సలైట్లను కాంగ్రెస్ పార్టీ పోషిస్తుందని విమర్శించారు. ఈ మహా ధర్నా మహా ధర్మయుద్ధంగా మారుతుందని జోస్యం చెప్పారు.

హామీలు అమలు ఏమైంది?
సీఎం రేవంత్ కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సవాల్

బీజేపీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్ లో చేపట్టిన మహాధర్నాలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. మిగులు బడ్జెట్ తో ఉన్న తెలంగాణను బీఆర్ఎస్ తన పదేండ్ల పాలనలో అప్పుల రాష్ట్రంగా మార్చిందని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో అనేక అవినీతి, అక్రమాలు జరిగాయని, పదేండ్లపాటు ఒక నియంత పాలన ప్రజలపై రుద్దబడిందన్నారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌పట్ల విసిగి అనేక రకాల హామీలతో, అభయహస్తాలతో, గ్యారంటీలతో వస్తున్నం అని చెప్పిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓటు వేశారని అన్నారు. ఈ రోజు రేవంత్‌రెడ్డి విజయోత్సవ పాలన పేరుమీద రాష్ట్రంలో పర్యటిస్తున్నారని, ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి నేను ఒక్కటే సవాల్ చేస్తున్నానని, ఏ మొఖం పెట్టుకొని ఈ ఉత్సవాలు చేస్తున్నారో ప్రజలు, బీజేపీ ప్రశ్నిస్తుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు తేడా లేదని, ఈ రెండు పార్టీలు కుటుంబ పార్టీలేనని అన్నారు. ఇచ్చిన హామీల అమలు ఏమైందని కాంగ్రెస్ పాలకులను ప్రజలు ఎక్కడికక్కడ నిలదీయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

పార్టీ అదేశిస్తే అమరణ దీక్ష: ఏలేటి మహేశ్వర్ రెడ్డి

రాష్ట్రంలో ఎక్కడ లంకెబిందెలు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి వెతుకుతున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. పరిశ్రమలు మూసేసిన మీరు.. ఎక్కడ ప్రారంభిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలను తరలించి రియల్ ఎస్టేట్ చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. లంకెబిందెల కోసమే పరిశ్రమలు తరలిస్తున్నారని విమర్శించారు. హిల్ట్ భూముల తరలింపునకు కేంద్ర పర్యావరణ అనుమతులు ఉన్నాయా? అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. పార్టీ ఆదేశిస్తే.... హిల్ట్ భూముల వాస్తవాలను బయటపెడుతానని స్పష్టం చేశారు. ఈ భూముల విషయంలో పార్టీ ఆదేశిస్తే ఆమరణ దీక్ష చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అర చేతిలో స్వర్గం చూపిస్తోందని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ విమర్శించారు. కాంగ్రెస్ స్కీమ్‌లో స్కామ్ లు తప్ప మరొకటి లేదని ఎద్దేవా చేశారు. బీసీలను కాంగ్రెస్ పార్టీ నిలువునా మోసం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ నైజాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి పాలన అబద్ధాలు, అవినీతి, అరాచకమని బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి అభివర్ణించారు. సిరి గల తెలంగాణను ఒకరు తాకట్టు పెడితే... ప్రస్తుత సీఎం అమ్మేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై బీజేపీ పోరాట పంథా మార్చాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.



ప్రపంచ దేశాలతో పోటీ పడే విధంగా రాష్ట్రం అభివృద్ధి

- బీసీ సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్ల పరిశీలన

ప్రతిపక్షం, రంగారెడ్డి, డిసెంబర్7: తెలంగాణ రాష్ట్రం ప్రపంచ దేశాలతో పోటీ పడే విధంగా అభివృద్ధి చేస్తున్నమని బీసీ సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్అన్నారు. ఆదివారం భారత్ ఫ్యూచర్ సిటీ లో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశిలించారు. ఈ సందర్భంగా డిజిటల్ టెన్నెల్, సెషన్ హాల్లను పరిశీలించిన మంత్రి, ఎక్కడా ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సూచన చేశారు. అనంతరం ఆర్టీసీలో మొదటి తరం ఆర్టీసీ బస్సు అయినటువంటి అల్బేన్ నుండి ఎలక్ట్రిక్ బస్సు వరకు ఆర్టీసీ అభివృద్ధి అని ప్రదర్శనగా ఉంచిన ఆర్టీసీ బస్సులను మంత్రి ఆసక్తిగా తిలకించారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా హైదరాబాద్ బ్రాండ్ పెరుగుతుందని, ప్రపంచ దేశాలు హైదరాబాద్ వైపు చూస్తున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రి వెంట ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్ రాజ్, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు



బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి
- పీర్లగూడలో అంజయ్య యాదవ్ తో కలిసి ప్రచారం


ప్రతిపక్షం, షాద్‌నగర్: బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన పదేళ్ల కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు పల్లెలకు కొత్త వెలుగులు తెచ్చాయి.. మరెన్నో సంక్షేమ కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రజలకు ఉపాధి వెలుగులు వచ్చాయి.. ప్రగతి వైపు సాగుతున్న పల్లెలు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో అధోగతి వైపు పయనిస్తున్నాయని ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి అన్నారు. ఫరూక్ నగర్ మండలం రాయికల్, కందివనం, పీర్లగూడ గ్రామాలలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పీర్లగూడలో అంజయ్య యాదవ్ తో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా, అధికారంలోకి వచ్చాక రైతు భరోసా, రైతు బీమా, వృద్ధులకు పెన్షన్లు, కల్యాణ లక్ష్మి ,షాది ముబారక్ లాంటి ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించే దిశగా కొత్త అడుగులు వేసిందన్నారు. పీర్లగూడ గ్రామంలో తమ మద్దతుతో పోటీ చేస్తున్న పీర్లగూడకు చెందిన కుర్షీద్ బేగం, కందివనం అభ్యర్థి జెమినీ భాయ్, రాయికల్ అభ్యర్థి మామిడిపల్లి సురేఖను గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. ఎమ్మెల్సీగా గ్రామ అభివృద్ధికి భవిష్యత్తులో తన వంతు సహకారం అందిస్తానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.



తెలంగాణ దశను మార్చనున్న గ్లోబల్ సమ్మిట్

- ప్రపంచ ఉన్నత నగరాల స్థాయికి ఫ్యూచర్ సిటీ
- గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రతిపక్షం, రంగారెడ్డి, డిసెంబర్7 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈనెల 8, 9 తేదీల్లో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ తోతెలంగాణ రాష్ట్రం దిశ దిశ మారుతుందని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మీర్ ఖాన్ పేట్ లో జరుగుతున్న సమ్మిట్ ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఈ ప్రపంచ స్థాయి సమ్మేళనంతో ప్రపంచ నగరాల స్థాయికి ఫ్యూచర్ సిటీ చేరుతుందని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం రెండేళ్ల పాలన, 2047 లక్ష్యంగా సాగుతున్న ప్రణాళికలు తదితరాలకు ఊతమిచ్చే విధంగా పెట్టుబడులు రానున్నాయని అన్నారు ఇప్పటికే దేశ విదేశాలకు చెందిన 150 మంది అత్యంత ప్రముఖులు ఈ సమ్మిట్ లో పాల్గొనబోతున్నారని చెప్పారు రెండు రోజులపాటు జరిగే ఈ సమ్మేళనం కోసం విశేష రీతిలో ఏర్పాట్లు జరిగాయని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.



సర్పంచ్ గా గెలిపిస్తే సేవకుడిగా పని చేస్తా

- నాగిరెడ్డి గూడ సర్పంచ్ అభ్యర్థి కేసరి పద్మ సంజీవరెడ్డి

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 7 : సర్పంచ్ గా గెలిపిస్తే పాలకుడిగా కాదు సేవకుడిగా పనిచేస్తానని నాగిరెడ్డి గూడ సర్పంచ్ అభ్యర్థి కేసరి పద్మ సంజీవరెడ్డి అన్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి రాజకీయంలో వచ్చానని, ఒకసారి అవకాశం ఇస్తే నాగిరెడ్డి గూడ గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు, ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలను ప్రజలందరికీ అందే విధంగా పోరాడుతానని తెలిపారు, గ్రామ ప్రజలంతా కత్తెర గుర్తుకు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నాగిరెడ్డి గూడ ప్రజలను కేసరి పద్మ సంజీవరెడ్డి కోరారు.



ప్రశాంత వాతావణంలో ఎన్నికలు జరిగేలా చూడాలి

- మొయినాబాద్ సీఐ పవన్ కుమార్ రెడ్డి

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 7 : ఈ నెల 14న జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు పార్టీ నాయకులకు ఓటర్లకు సీఐ పవన్ కుమార్ రెడ్డి సూచించారు. మండల పరిధిలోనీ గ్రామాలలో ఎన్నికలపై స్థానిక నాయకులు ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... ఎన్నికలవేళ ప్రచారంలో గాని ఫలితాలు సమయంలో గానీ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాలలో కూడా రెచ్చగొట్టే ప్రసంగాలు పోస్టులు పెడితే సహించే ప్రసక్తే లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారిని సంధ్య, పలువురు పోలీస్ సిబ్బంది, స్థానిక నేతలు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దమంగళారంలో వ్యక్తి అదృశ్యం



ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 7 : ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పెద్ద మంగళారం గ్రామానికి చెందిన మందడి రవీందర్ రెడ్డి (36) వృతి రీత్యా ఎలక్ట్రికల్ ట్రాక్టర్ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈనెల ఆరవ తేదీన మధ్యాహ్నం మూడు గంటల సమయంలో పనికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. తన భర్త ఫోన్కు కాల్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. ఆయన స్నేహితులను అడగగా ఇంటికి వెళ్తానని చెప్పి బయలుదేరినట్లు తెలిపారు. దీంతో అన్ని ప్రదేశాల్లో తన భర్త ఆచూకీ కోసం వెతికిన ఆచూకీ లభించలేదని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లియోనల్ మెస్సి ఫుట్బాల్ మ్యాచ్‌కు

దేశం నలుమూలల నుంచి అభిమానులు


- మ్యాచ్ నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



ప్రతిపక్షం, స్టేట్‌బ్యూరో, హైదరాబాద్: ప్రపంచ ప్రఖ్యాత ఫుట్బాల్ క్రీడాకారుడు లియోనల్ మెస్సి మ్యాచ్ అంటే ఫుట్బాల్ ప్రేమికులు ఊగిపోతారు, ఈ మ్యాచ్ కోసం దేశం నలుమూలల నుంచి ఈ నెల 13న ఉప్పల్ స్టేడియంకు తరలివస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. నేడు మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ఆయన ఉప్పల్ స్టేడియాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఉత్సవాలు ప్రారంభమయ్యాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలో పర్యటిస్తున్నారని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత ఫుట్బాల్ ప్లేయర్ లియోనల్ మెస్సికి ప్రపంచవ్యాప్తంగా భారీ ఆదరణ ఉంది, ఆయనకు ప్రత్యేక భద్రత వ్యవస్థ ఉంటుంది .ఈనెల 13న హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి టీం తో ఫ్రెండ్లీ మ్యాచ్ నేపథ్యంలో పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు జరుగుతున్నాయని వాటిని పరిశీలిస్తున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. తెలంగాణ రైజింగ్ ఉత్సవాల్లో పాల్గొనేందుకు లియోనల్ మెస్సి సైతం ఆసక్తి చూపారని డిప్యూటీ సీఎం తెలిపారు. దేశం నలుమూలల నుంచి వేలాది మంది ఫుట్బాల్ క్రీడాభిమానులు మ్యాచ్ కోసం వస్తున్న నేపథ్యంలో భద్రత, సౌకర్యం తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని నిర్దేశించిన సమయం కంటే ముందే అభిమానులు స్టేడియంలోకి చేరుకొని వారి వారి సీట్లలో కూర్చోవాలని డిప్యూటీ సీఎం తెలిపారు. లియోనల్ మెస్సి ఫ్రెండ్లీ మ్యాచ్ సందర్భంగా ఫుట్బాల్ క్రీడా అభిమానులకు అన్ని రకాల వసతులు ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ నేపథ్యంలో హైదరాబాద్ నగరానికి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వ్యక్తులు, సంస్థల అధిపతులు, సీఈవోలు హైదరాబాద్ కు వస్తున్నారని వివరించారు. ఫుట్బాల్ మ్యాచ్ ఏర్పాట్లను రాచకొండ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్లు ప్రత్యేకంగా దృష్టి పెట్టి భద్రత ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను పోలీస్, హెచ్సీఏ అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. ప్రఖ్యాత క్రీడాకారుడు మెస్సి ఫుట్బాల్ మ్యాచ్ కోసం వచ్చి, వెళ్లే మార్గాలు, ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర విఐపి లు వచ్చి వెళ్లే మార్గాలను డిప్యూటీ సీఎం ప్రత్యేకంగా పరిశీలించారు. మొత్తంగా హాజరవుతున్న అభిమానుల సంఖ్య, సులభంగా వచ్చి వెళ్ళేందుకు ఏర్పాటుచేసిన గేట్ల సంఖ్య, పార్కింగ్ ఫుట్బాల్ క్రీడా అభిమానుల కోసం మెట్రో, ఆర్టీసీ వంటి రవాణా సంస్థల ద్వారా ఏర్పాటు చేస్తున్న రవాణా సౌకర్యాలను డిప్యూటీ సీఎం సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం తో పాటు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడిషనల్ డీజీ విజయ్ కుమార్, రాచకొండ సి పి సుధీర్ బాబు, రోహన్ రెడ్డి, శివ సేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రీమ్ వాలి రిసార్ట్ లో వ్యక్తి మృతి

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 7: ఎంకేపల్లి లోని డ్రీమ్ వాలి రిసార్ట్ లో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని గాంధీనగర్, రామంతపూర్, హైదరాబాద్ చెందిన రాజా ప్రదీప్ (62) వృత్తిరీత్యా సెక్యూరిటీ గార్డ్ గా గత నాలుగు సంవత్సరాలుగా ఐడియల్ ఉప్పల్ రామంతపూర్ వద్ద ఉన్న ఫూజియన్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్, ఇండికో హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ లో సెక్యూరిటీ గాడుగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. శనివారం తన స్నేహితులతో కలిసి వీకెండ్ ట్రిప్ కోసం ఎంకేపల్లి లోని డ్రీమ్ వాలి రిసార్ట్ కి వెళ్ళారు. ఆదివారం ఉదయం 9 గంటల 30 నిమిషాలకు అతని తండ్రి పడుకున్న దగ్గరే స్పృహ కోల్పోయి నోటిలో నుండి నురుగు వస్తున్నట్లు రాజ ప్రదీప్ కుమారుడికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే వారు అతన్ని చికిత్స కోసం కొండాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ డ్యూటీ డాక్టర్ పరిశీలించి రాజా ప్రదీప్ మృతి చెందినట్లు నిర్ధారించారు. శనివారం రాత్రి మద్యం సేవించి 11 గంటలకు నిద్రపోయాడని ఉదయం 8:30 గంటలకు అతని నిద్ర లేపడానికి వెళ్లగా ఆయన స్పృహ లేకుండా నోటిలో నురుగు వస్తు కనిపించాడని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



'ఆపరేషన్ సిందూర్'లో భారత సైనికుల సామర్థ్యం, క్రమశిక్షణ చూశాం. పరాక్రమంతో పాటు సంయమనం కూడా చూపారు. ఎంత కావాలో అంతే చేశారు. అనుకుంటే మరింత చేసేవారు. బీఆర్వో పూర్తి చేసిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, బార్డర్‌లో మెరుగైన కనెక్టివిటీ భద్రతా దళాలు సమర్థవంతంగా పనిచేయడానికి దోహదపడుతోంది.

\- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

బహుళ

సామాజికం

తెలంగాణ మణిదీపం పీవీఆర్

పీవీ రాజేశ్వరరావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన నిస్వార్థ సేవలు, అరుదైన కృషి, ప్రజల జీవితాలలో వెలిగించిన కాంతిని మనమందరం స్మరించుకోవాలి. ఆయనకు హృదయపూర్వక జోహార్లు. స్మారక సంచిక వెలువరించడంలో ముందుండి కృషి చేస్తున్న కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు. 'పువ్వు పుట్టినప్పుడే పరిమళించినట్టు' చిన్నప్పటినుండే రాజేశ్వర్ రావు ఏక సంథాగ్రాహి. సిద్ధిపేట, హైదరాబాదు, నాగపూర్ లో విద్యాబ్యాసం చేసి, బీఏ, ఎల్ఎల్బీ చేసి సిద్ధిపేటలో న్యాయవాద వృతి చేపట్టినారు. కాలేజీ లో లీడర్ గా ఉద్యమకర్త, క్విట్ ఇండియా ఉద్యమం, రజాకారుల వ్యతిరేక ఉద్యమం చేసి జైలు పాలైన నాయకుడు. స్వతంత్ర సమర యోధుడు.



బి. వేణుగోపాల్
99891 91853

సిద్ధిపేట అనే పట్టణం నేడు తెలంగాణ అభివృద్ధి పటంలో ప్రత్యేక స్థానం సంపాదించి నిలుస్తుంటే, దాని వెనుకున్న చరిత్రలో ఒక ప్రఖ్యాత వ్యక్తిత్వం ఔజ్వల్యంగా మెరవడం సహజం. ఆ వ్యక్తిత్వమే పీవీ రాజేశ్వరరావు. చీకటి, వెనుకబాటుతనం, పరిమిత అవకాశాల నడుమ అభివృద్ధి ఆమడ దూరంలో ఉన్న కాలంలో సిద్ధిపేటకు రెండు వెలుగులు ప్రసాదించిన దార్శనికుడు, విద్యుత్ వెలుగు, విద్యా వెలుగు. ఈ రెండు వెలుగులూ ఈరోజు సిద్ధిపేట ఘనతకు పునాది రాళ్లుగా నిలిచాయి. హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్నప్పటికీ నిజాం పాలనలో సిద్ధిపేటకు అభివృద్ధి అనేది లభించని వరమైంది. సంస్థానం కాదు, జిల్లా కేంద్రం కాదు, చారిత్రక గుర్తింపు లేదు. ఇలాంటి స్థితిలో ఉన్న పట్టణాన్ని అభివృద్ధి దిశగా మలచడానికి తొలి అడుగులు వేసింది రాజేశ్వరరావు వంటి నాయకులే. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆయన, హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావుతో సన్నిహితులు. తొలి సాధారణ ఎన్నికలలో ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ ప్రభంజనం కారణంగా ఎడ్ల గురువారెడ్డి శాసనసభ్యుడిగా గెలిచారు. అలా రాజేశ్వరరావు అధికార పార్టీ నాయకుడే అయినా ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చింది. అయినప్పటికీ, సిద్ధిపేట అభివృద్ధి విషయంలో ఆయనకు అధికార-ప్రతిపక్షాల మధ్య ఎలాంటి గీతలు లేవు.

సిద్ధిపేట చీకటిని తొలగించిన గొప్ప సేవ

ఆ రోజులలో సిద్ధిపేట ఒక ప్రముఖ వ్యాపార కేంద్రమై ఉన్నా, విద్యుత్ సౌకర్యం లేక ఆర్థిక, సామాజిక జీవితం చీకటిలోనే ఉండేది. జగతి లోకాన్ని వెలిగించే విద్యుత్, సిద్ధిపేటకు అందాలన్న సంకల్పంతో రాజేశ్వరరావు చేసిన కృషి అద్భుతం. వీధి వీధికి, ఇంటి ఇంటికి వెలుగు చేర్చడానికి పవర్‌హౌస్ ఏర్పాటు కలను నిజం చేశారు. 'సిద్ధిపేట వెలిగింది' అంటే, అది పీవీ రాజేశ్వరరావు కృషి వెలుగే. అజ్ఞానాంధకారం తొలగించిన రెండో కాంతి విద్య. విద్యుత్ వెలుగు చాలదని, అజ్ఞాన చీకటి తొలగితేనే సమాజం ఎదుగుతుందని ఆయన విశ్వసించారు. ఆ రోజులలో సిద్ధిపేటలో ఉన్న విద్యాసంస్థ మల్టీ పర్పస్ హైస్కూల్ మాత్రమే. ఉన్నత విద్య అనేది దూర నగరాలకు వెళ్లిన భాగ్యం. స్థానిక పేదవారి పిల్లలకు ఆ అవకాశం అందని ద్రాక్ష. ఈ సమస్యని శాసనసభ్యుడు ఎడ్ల గురువారెడ్డి, ముఖ్యమంత్రి రామకృష్ణారావులతో సమన్వయం చేస్తూ రాజేశ్వరరావు ముందుకు తీసుకెళ్లారు. ముందుగా న్యూ ఎడ్యుకేషన్ సొసైటీ స్థాపించి, వ్యాపారులను గోదాం ఇవ్వడానికి ఒప్పించి, చివరకు హార్ట్ సైన్స్ కాలేజీ స్థాపించారు. 1956లో ప్రారంభమైన ఈ కాలేజీ సిద్ధిపేట చరిత్రను మలచిన సంస్కరణ.

ప్రజల మనసు గెలిచి శాసనసభ్యునిగా

రాజేశ్వరరావు చేసిన సేవలను గుర్తించిన సిద్ధిపేట





ప్రజలు ఆయనను 1957 సాధారణ ఎన్నికలలో ఘన విజయం అందించి శాసనసభ్యునిగా ఎన్నిక చేశారు. ఆ తరువాత ఆయన చేసిన అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగం అందుకున్నాయి. ఆయన కాంగ్రెస్ లో ఉన్న ప్రభావం ద్వారా అప్పటి ముఖ్యమంత్రులు నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజీవయ్యను ఒప్పించి కాలేజీని ప్రభుత్వ యాజమాన్యానికి మార్చేలా చేశారు. కొత్త భవనం నిర్మాణం, అభివృద్ధి కార్యక్రమాలు రాజేశ్వరరావు కృషితోనే సాకారమయ్యాయి.కేవలం కళాశాల కాదు, ఆ కళాశాల నుంచి చదివి వేలాది విద్యార్థులు నేడు ఎన్నో రంగాలలో కీర్తి గడిస్తున్నారు. వారి విజయాల పునాదిలో రాజేశ్వరరావు విశాల హృదయం, దార్శనికత, సమాజపట్ల ప్రేమ స్పష్టంగా కనిపిస్తుంది.

పీవీ నరసింహారావుకి కూడా స్ఫూర్తి

మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వంటి వారికి కూడా పీవీ రాజేశ్వరరావు గురువులుగా, మార్గదర్శకులుగా ఉండేవారని చెబుతారు. ఇలాంటి నాయకులను తీర్చిదిద్దిన వ్యక్తిత్వం రాజేశ్వరరావుదే. సిద్ధిపేట నేడు పొందిన ఖ్యాతికి పునాది ఆయనదే. సిద్ధిపేట విద్య, వైద్యం, పర్యావరణం, పాలన, మౌలిక వసతులు అన్ని రంగాలలో ప్రత్యేక గుర్తింపు పొందింది. కానీ, ఆ అభివృద్ధికి తొలి అడుగు వేసింది పీవీ రాజేశ్వరరావు. చీకటి తొలగించి వెలుగు తీసుకువచ్చిన నాయకుడి జ్ఞాపకం సిద్ధిపేట చరిత్రలో శాశ్వత అక్షరాలుగా నిలిచిపోతుంది.

శతజయంతి సందర్భంగా

పీవీ రాజేశ్వరరావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన నిస్వార్థ సేవలు, అరుదైన కృషి, ప్రజల జీవితాలలో వెలిగించిన కాంతిని మనమందరం స్మరించుకోవాలి. ఆయనకు హృదయపూర్వక జోహార్లు. స్మారక సంచిక వెలువరించడంలో ముందుండి కృషి చేస్తున్న కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు.

'పువ్వు పుట్టినప్పుడే పరిమళించినట్టు' చిన్నప్పటినుండే రాజేశ్వర్ రావు ఏక సంతాగ్రాహి. సిద్ధిపేట, హైదరాబాదు, నాగపూర్ లో విద్యాబ్యాసం చేసి, బీఏ, ఎల్ఎల్ బీ చేసి సిద్ధిపేటలో న్యాయవాద వృతి చేపట్టినారు. కాలేజీ లో లీడర్ గా ఉద్యమకర్త, క్విట్ ఇండియా ఉద్యమం, నిజాం రజాకార్ల వ్యతిరేక ఉద్యమం చేసి జైలు పాలైన నాయకుడు. స్వతంత్ర సమర యోధుడు.

అమృతబాయి భార్య, ఐదుగురు కుమారులు, నలుగురు కూతుర్లు. మనుమలు మనుమరాళ్లు ధన్య జీవులు. వారి శత జయంతి ఉత్సవం సిద్ధిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో డిసెంబర్ 8న కళాశాల వారి సౌజన్యంతో జరుపుతున్న కుటుంబ సభ్యులు. సహకరించిన అందరికీ పేరు పేరున ధన్యవాదములు.

(వ్యాస రచయిత అడ్వకేట్)

(ప్రముఖ రచయిత కవి నందిని సిధారెడ్డి గారి సౌజన్యంతో)

పరిచయం

నేపాలీ సాహిత్య రత్నం పారిజాత్



డా.టి.రాధాకృష్ణమాచార్యులు
9849305871

ఒక కలం, ఒక పుస్తకం, ఒక ఆలోచన అన్నీ కలిసి సమాజం చుట్టూ తిరుగుతూ, రుగ్మతలపై పోరాటం చేయడం అక్కడక్కడ అప్పుడప్పుడు వింటూ, చూస్తాం. ఆ కోవలోనిదే నేపాలీ కవి రచయిత్రి పారిజాత్ సారస్వతం,జీవితం కూడా. భారతదేశంలో టీ తోటలకు ప్రసిద్ధి చెందిన డార్జిలింగ్‌లో 16 సెప్టెంబర్1937న జన్మించిన పారిజాత అసలు పేరు బిష్ణు కుమారి వైబా. ఆమె తండ్రి డాక్టర్ కె.ఎన్. వైబా ఒక మానసిక వ్యాధుల వైద్యుడు, తల్లి అమృత మోక్తన్ పారిజాత్. పారిజాత్ చిన్నతనంలోనే వైబా మరణించింది. దాంతో పారిజాత్ తన తండ్రి మరింకా తాతామామల ఆలనాపాలనలో పెరిగింది. డార్జిలింగ్ నేపాలీ సంస్కృతికి, భాషాసాహిత్యానికి ప్రధాన కేంద్రం. డార్జిలింగ్‌లో నేపాలీ ప్రజలతో పాటు భారతీయులు నివసిస్తున్నారు, వారు కూడా నేపాలీ భాషనే మాట్లాడతారు. నేపాలీల మాదిరిగానే సంస్కృతిని కలిగి ఉంటారు. పారిజాత తన చిన్నతనం నుండే నేపాల్ తో, ఇంకా నేపాలీ సాహిత్యంతో విడదీయరాని బంధంగా ముడిపడి ఉంది. ఆమెకు బాల్యం నుండే సాహిత్యంపై అమితమైన ఆసక్తి ఉంది. పారిజాత తన పాఠశాల విద్యలో కొంత భాగాన్ని డార్జిలింగ్‌లో పూర్తి చేసి,1954లో నేపాల్‌లోని ఖాట్మండులో స్థిరపడింది. ఆమె 'పద్మ కన్య' పాఠశాలలో చదివి పాఠశాల విద్య పూర్తి చేసి, బీఏ, ఎంఏ ఇంగ్లీషు సాహిత్యంలో డిగ్రీని పొందింది. పారిజాత 26 సంవత్సరాల వయస్సులో పక్షవాతానికి గురైంది.ఆమె సోదరి తన జీవితంలో ఎక్కువ భాగం ఆమెను చూసుకుంది.

పారిజాత్ శారీరక గాయాలనూ ఇబ్బందులను ఎదుర్కొంటూనే ఆమె సాహిత్యానికి తోడ్పడుతూనే, సామాజిక సమస్యలకు మద్దతు ఇవ్వడానికి కూడా ప్రయత్నించిన గొప్ప రచయిత్రి. పారిజాత్, అలాగే ఖైదీల సహాయ మిషన్ వంటి కార్యక్రమాలు ప్రారంభించింది.

నేపాలీ ఆలోచనాపరురాలు

ఒక సాహిత్యకారుడు పారిజాత్ ను 'ఒక ప్రముఖ నేపాలీ ఆలోచనాపరురాలు, సాహిత్యవేత్తగా' అభివర్ణిస్తూ, ఆమె రచనలు సాహిత్య రంగంలో చెదరని ముద్ర వేశాయంటూ, 'పారిజాత్ నేపాలీ సాహిత్య రంగంలో ఒక ప్రకాశవంతమైన నక్షత్రం' అంటారు. పారిజాత్ ప్రశంసలు పొందిన నవల శిరిష్కో ఫూల్ 'ది బ్లూ మిమోసా'గా అనువాదమైంది. ఆమె ఇతర రచనలు అస్తిత్వవాదం, స్త్రీవాదం, ఇంకా సామాజిక అన్యాయం ఇతివృత్తాలను అన్వేషిస్తాయి . ఆ సమయంలో రాష్ట్రం శాపం, పేదరికం, పరిస్థితులు పారిజాత జీవిత కథను సంతోషకరమైనదిగా చేయవు. అయినప్పటికీ, ఆమె కుటుంబ పరిస్థితి, ఆరోగ్యం సరిగా లేనప్పటికీ, ఆమె సృజనాత్మకత, మేధో స్వేచ్ఛకు దృఢమైన సంధాన కర్తగా, అడ్వకేట్ గా పనిచేసి స్థితిస్థాపకత, కళాత్మక ప్రతిభకు చిహ్నంగా మారింది. ఆమె ఖాట్మండులో చదువుతున్నప్పుడు 'ధర్తి'తో తన సాహిత్య జీవితాన్ని ప్రారంభించింది. నవలలు, కథలు, కవితలు, వ్యాసాలు మొదలైన వాటి రచయిత్రిగా ఉండటమే కాకుండా, ఆమె 1966లో 'రాల్ఫా ఉద్యమానికి' నాయకత్వం వహించింది. ఆమె త్రిభువన్ విశ్వవిద్యాలయం సభ్యురాలిగా ఎన్నికయ్యారు. రాల్ఫా సాహిత్య ఉద్యమంలో భాగమయ్యారు. ఆమె ప్రగతిశీల లేఖక్ సంఘ్ స్థాపనలో కూడా ముఖ్యమైన పాత్ర పోషించారు. అఖిల్ నేపాల్ మహిళా మంచ్, బంది సహాయత నియోగ్, అలాగే నేపాల్ మానవ్ అధికార్ సంఘటన్‌లలో కూడా పనిచేశారు.

మదన్ పురస్కార్‌ను గెలుచుకొని

పారిజాత్ ప్రసిద్ధిచెందిన నవల శిరిష్కో ఫూల్ రాసింది. దీనికి ఆమె మదన్ పురస్కార్‌ను గెలుచుకొని ఈ అవార్డును అందుకున్న మొదటి మహిళగా నిలిచింది. ఆమె తన జీవితకాలంలో బహుళ నవలలను ప్రచురించింది మరియు అనేక కవితలు, కథలను రాసింది. ఆమె డిసెంబర్ 4, 1993న తన 56ఏళ్ళ వయస్సులో ఖాట్మండు, నేపాల్ లో మరణించిన ఆమె డార్జిలింగ్ నేపాలీ భాషా రచయితలు, సంగీతకారులు, కళాకారులు జన్మించిన మాతృభూమిగా చెబుతారు. ఈ ప్రాంతం నేపాలీ సాంస్కృతిక వైవిధ్యంతో సమృద్ధిగా ఉండి అనేక మంది గొప్ప వ్యక్తులు ఇక్కడ పుట్టి



నవారు, మరి నేపాల్‌లోని ఖాట్మండుకు వచ్చి తమ ప్రతిభను, సామర్థ్యాలను ప్రదర్శించడంలో తమ జీవితాలను గడిపారు. అలాగే రచయిత్రి పారిజాత కూడా అలాంటి గొప్ప వ్యక్తులలో ఒకరుగా చరిత్రలో మిగిలిపోయారు. పారిజాత ఆంగ్లానువాదం చేసిన కవితలోని కొన్ని పంక్తులకు మచ్చుకు నా తెలుగు అనువాదం.

నేను నా స్వీయ శవాన్ని పెట్టుకున్నాను

'నా లోపలి ఎవరో వదిలేసే ప్రయత్నంలో, కానీ / ఇవి నా అవశేషాలు కావు/ ప్రతి రాత్రి నేను చస్తూ బతుకుతున్నా /నా ముందు నేను నా స్వీయ శవాన్ని పెట్టుకున్నాను'లోపలి బాధను కవితాత్మకంగా వ్యక్తీకరించడంలో ఆమె ఓ ఎక్స్‌పర్ట్. ఆమె డార్జిలింగ్‌లో జన్మించి తన బాల్యాన్ని గడిపినప్పటికీ, ఆమె 1954లోనే తన యవ్వనం ప్రారంభంలో నేపాల్‌కు వచ్చింది.తన రచనలు,సామాజిక ప్రగతిశీల సేవలతో నేపాలీల మనసులో చిరస్థాయిగా నిలిచిపోయింది.ఇక పారిజాత్ విగ్రహాన్ని పశ్చిమబెంగాల్ లోని సిలిగురిలో నెలకొల్పడం రచయిత్రిగా ఆమె గౌరవానికి, సృజనలోకంలో సాహిత్య సేవలకు చిరస్మరణీయం గుర్తింపు.

(పరిచయకర్త కవి, రచయిత)

కవిత



నీ ఓటు భవితకు బాట

ఓటరన్న మేలుకో
ఓటు విలువ తెలుసుకో
అవినీతి అక్రమాలనరికట్టు
ప్రగతి మార్గానికి నీ ఓటు తొలిమెట్టు
ప్రజాస్వామ్యం రక్షణకే నీ ఓటు!!

మాయమాటలకు పడపోకు
నీ ఓటు ఒక వజ్రాయుధం
నీ ఓటు అభివృద్ధికి సూచిక
నీ ఓటు ప్రజాస్వామ్యానికి మనుగడ!!

నీ ఓటు అవినీతిపరులపై తూట కావాలి
అందరం ఓటు వేద్దాం
ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం
బాధ్యతగా ఓటు వేద్దాం
భవిష్యత్తుకు బాట వేద్దాం!!



దేవులపల్లి రమేశ్
నంగునూర్, సిద్దిపేట
9963701294



వెతుకులాట

కండబలం చాలక
కన్యత్వం కమిలిపోయే !
ఆకలి తీరిన మృగం
అంశమును గర్భంలో
వదిలిపోయే !
చెరచబడ్డ పడతని
పుట్టింటి తలుపులు
మూసుకుపోయే !
కడుపులోని నలుసు
చావుకూ అడ్డుపడిపోయే !
ఆకలి తాళలేక
తల తాకట్టుకు వెళితే
తలతాకట్టు చెల్లదాయె !
తళుకులీనే తనువుకు
బేరం కుదిరి పోయే !
గతుకుల బతుకులో
తనువూ కరిగి పోయే !

కదిలే కాలంతో పాటు
కన్నపేగు కలవాడుగా
ఎదిగిపోయే !
ఆడంబరాల
అంతఃపురములో
వెలయాలు ఎందుకని
వెడలుగొట్టే !
"కడుపు చేసినవాడు
మొగుడు కాక
కడుపున పుట్టినవాడు
కొడుకు కాక
సుఖరోగాల పుట్టకు
చావురాక
సుఖనిద్రనిచ్చే
ఆరడుగుల నేల
కోసం వెతుకులాట

సురేంద్ర రొడ్డ
9491523570



విశ్లేషణ

ఆదర్శనీయం ఆచార్య బన్నా విజయపథం



డా. అమ్మిన శ్రీనివాసరాజు
77298 83223

ప్రతి ఒక్కరి చరిత్ర ప్రతి ప్రాంత చరిత్ర ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ అక్షరీకరించి భావితరాల వారి కోసం భద్రపరచాల్సిన అత్యవసర సమయం ప్రస్తుతం మన ముందు ఉంది. దానికి సంబంధించి ఆనాడు ఆత్మకథలు స్వీయ చరిత్రలు జీవిత చరిత్రలు వెలువడి ఆనాటి వ్యవస్థల అన్ని విధాల స్థితిగతులు అక్షరాల రూపంలో రికార్డు చేయబడి ప్రస్తుతం ఎంతో కొంత మనకు అందుబాటులో ఉన్నాయి. అందులో భాగంగానే నేటి ఆధునిక సాహితీ యుగంలో "అభినందన సంచికలు" వెలువడుతున్నాయి, చూపుకు ఇవి వ్యక్తిగత వ్రాతలుగా అగుపించిన లోచూపుతో ఆయా వ్యక్తులను బట్టి అవి విభిన్న కోణాలలో విభిన్న వ్యక్తుల ద్వారా బహు కోణాల గుండా ఆవిష్కరించిన సంపూర్ణ ప్రామాణిక వ్యక్తి జీవన పథాలుగా భావి కాలాలకు ఉపయుక్తంగా ఉంటున్నాయి. అతి సామాన్య కుటుంబంలో పుట్టి అకుంఠిత దీక్షతో అంబేద్కర్ ప్రేరణ స్ఫూర్తితో నిత్య అధ్యయన సాయంగా, అక్షర ఆచార్యుడై విశ్వవిద్యాలయ స్థాయిలో విశేష కృషిచేసి నేటితరం బోధకులందరికీ ఆదర్శంగా నిలిచిన ఆచార్య బన్న అయిలయ్య షష్టిపూర్తి సందర్భంగా వెలువరించిన అభినందన సంచిక 'విజయ పథం'

'విశ్వంభర' కావ్యంలా

'ఆదిమ కాలం నుంచి ఆధునిక కాలం దాకా సాగిన మానవ విజయ మహేతిసం' అని విశ్వంభర కావ్యాన్ని ఏకవాక్య నిర్వచనంగా చెప్పినట్టుగానే, 'నిరుపేద స్థితి నుంచి నిరూపమాన స్థాయికి చేరిన ఒక అధ్యయనశీలి ప్రయాణమే" ఈ విజయ పథం అనవచ్చు, 180 మంది విభిన్న వర్గాల వారి అభిప్రాయాల వేదికను 596 పుటలలో నిక్షిప్తం చేసిన బృహత్ పుస్తకం ఇది, దీనిని అభినందన, ఆత్మీయం, అక్షర యానం, అనే మూడు మార్గాలు గుండా సాగించి ఆఖరికి ముచ్చట్లతో ముగించారు. వరంగల్లు వద్ద నర్సంపేట సమీపంలోని రంగంపేట లో పుట్టి కడు పేదరికపు అంబుధిని ఈది అంచలంచెలుగా ఎదిగిన బన్న అయిలయ్య సాధన, క్రమశిక్షణ, అధ్యయనం సాయంగా కాకతీయ విశ్వవిద్యాలయం వేదికగా సర్వోన్నతమైన విద్యా శిఖరమైన నిలిచారు. కుటుంబ నేపథ్యం కానీ సామాజిక సాయంగాని లేకుండా తనకు తాను ఎదగటం వెనుక గల విషయాలు విశేషాలు



తెలిపేదే ఈ "విజయ పథం" అటు ఆచార్యునిగా బోధనలోను, ఇటు సామాజిక స్పృహతో తనదైన బోధనా భాష తెలుగు సాహిత్యంలో ప్రామాణికమైన రచనలు చేయడం కవిగా తన సామాజిక వర్గం ఎదుర్కొంటున్న కష్టాలను గురించిన ఆవేదనను అక్షరీకరించి ప్రేరణాత్మక కవితలు వ్రాయడంలోనూ అయిలయ్య శతశాతం విజయం సాధించి చేతులు ముడుచుకు కూర్చుంటే ఆయన ఆదర్శ ఆచార్యుడు అయ్యేవారు కాదు.


సాహితీ సభలో అంతే హృద్యంగా

తరగతి గదిలో పాఠం ఎంత ఆకర్షణీయంగా చెప్పగలరో, సాహితీ సభలో అంతే హృద్యంగా మాట్లాడి ప్రేక్షకుల మెప్పు పొందగలరు, కలం పట్టి రచనా వ్యాసంగంలో అడుగిడారంటే, అంతే ప్రామాణికంగా పాఠకులను తన అక్షరాల వెంట నడిపించి పరుగులు పెట్టించగలరు, బోధనలో కేవలం విశ్వవిద్యాలయ విద్యార్థులకే పరిమితం కాకుండా సార్వత్రిక విద్య పట్ల కూడా విద్యార్థుల్లో ఆసక్తి కలిగించి ఆ విధానంలో ఉన్నత చదువులు చదివించడమే కాక పరిశోధనలు సైతం చేయించిన ఆదర్శ మార్గదర్శి అయిలయ్య. అంతేకాక మలిదశ తెలంగాణ ఉద్యమంలో రచయితల పక్షాన నిలిచి నాయకత్వం వహించిన ఆదర్శ నాయకుడు యువజన ప్రేరకుడు. కవిగా దళిత చైతన్య సారథిగా తన కలం పతాక పట్టినా, ఏనాడు దళితేతరులను వ్యతిరేకించని సౌమ్యుడు సహృదయ మిత్రుడు, అందరివాడు అయిలయ్య సారు. కవిగా ప్రారంభమైన ఆయన రచన ప్రస్థానం ప్రామాణికమైన విమర్శ చేసే స్థాయికి ఎదిగింది, వీరి సద్విమర్శ ఆయా రచన వస్తువుల వెంటే ఉంటుంది తప్ప ఏనాడు వ్యక్తులు ప్రాంతాల పట్ల ద్వేష భావం చూపించదు, అందుకే వీరి విమర్శకు అంతటి విలువ ఆదరణ దక్కాయి. ఆధునిక తెలంగాణ సాహితీ చరిత్రకు సంబంధించిన అనేక అనేక విషయాలు, విశేషాలు, ఈ "విజయ పథం" అక్షర పేటికలో భద్రపరచబడ్డాయి.

ఊహ తెలియని చిన్న వయసులోనే

దళిత కుటుంబంలో పుట్టి ఊహ తెలియని చిన్న వయసులోనే తండ్రి ముత్తయ్య ప్రేమకు శాశ్వతంగా దూరమై, అమ్మ కనకలక్ష్మీ కాయ కష్టంతో పెరిగి, తాను సైతం వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కాలం పెట్టిన పరీక్షలో మిగిలిన ఇద్దరు అన్నలు కొమ్మాలు, నరసయ్యను కూడా కోల్పోయి తల్లికి తాను ఒక్కడే మిగిలి కడదాకా తన తల్లిని కంటికి రెప్పలా చూసుకుని సాకిన కారణజన్ముడు అయిలయ్య. తోడుగా "విజయ"మ్మను చేపట్టి ఆదర్శ వధూవరులు గానే కాక ఆదర్శనీయమైన దాంపత్యం సాగించిన సాగిస్తున్న ఉత్తమోత్తమ "మిధునం"వారు, కాలం పెట్టిన మరో విషమ పరీక్షలో శారీరక పెరుగుదలలేని అంగవైకల్యంతో పుట్టిన పుత్రుడిని 17 ఏళ్లపాటు సాగి చివరికి పుత్రశోకం మిగుల్చుకున్న వీరికి ప్రస్తుతం మిగిలిన ఏకైక ఆశాజ్యోతి అజయ్ రావు మాత్రమే..! భావితరం విద్యాలయ ఆచార్య లోకంతో పాటు నేటితరం అక్షర బోధకులంతా ఈ విజయ పథం వెంట కన్నుల ప్రస్థానం సాగించటం అత్యవసరం, విభిన్న రంగాలకు చెందిన వారంతా వారి వారి ఆదర్శవంతమైన కృషిని ఇలా అక్షరయుతం చేయడం బహుళ ప్రయోజనకరం. ఆ దిశగా కృషి చేసిన ఈ "విజయపథం" బాధ్యులందరూ అభినందనీయులు.

(విశ్లేషకులు సాహితీవేత్త)



ఎడారి వసంతం -30

గొలుసు కథ

పేజీ 7 'సింగిడి'లో

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

బీఆర్ఎస్ పార్టీ పతనం ప్రారంభమైంది

- కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ అసత్య ప్రచారం
- సిద్దిపేటలో కాంగ్రెస్ గెలుపు ఖాయం
- రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 7: కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నిచోట్ల నామినేషన్లు వేయలేదని బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి తీవ్రంగా విమర్శించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూజల హరికృష్ణతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. సిద్దిపేటలో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుస్తున్నారనే హైప్ క్రియేట్ చేస్తున్నారని, ఇదంతా తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని మంత్రి అన్నారు. జూబ్లీ హిల్స్ ఎన్నికల్లో కూడా టీఆర్ఎస్ నాయకులు ఇలాగే హైప్ సృష్టించి చివరకు ఓడిపోయారని ఉదాహరణగా పేర్కొన్నారు. కాంగ్రెస్ రెండేళ్లలో ఏం చేసిందని కేటీఆర్, హరీష్ రావు ప్రశ్నించడం వారి అవివేకమని ఆయన ఎద్దేవా చేశారు. ఆదివారం సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తుచేసుకుంటూ సీఎం 40 వేల ఉద్యోగాల భర్తీ చేపట్టినట్లు, మూడు ఏళ్లలో 17 లక్షల డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకున్నట్లు వివేక్ తెలిపారు. మహిళలకు ఇప్పటివరకు రూ.22 వేల కోట్ల వడ్డీ రహిత రుణాలు అందించామని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే 5 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేశామని అన్నారు.సిద్దిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థులు గట్టి పోటీ ఇస్తారని, జిల్లాలో మెజారిటీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని వివేక్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీలో పతనయాత్ర ప్రారంభమైందని, కేసీఆర్ ఇంట్లోనే ఆస్తుల విషయంలో కలహాలు మొదలయ్యాయని విమర్శించారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అత్తు ఇమాం, బొమ్మల యాదగిరి, ముద్దాం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రామకోటి సంస్థ ఆధ్వర్యంలో
శ్రీరామరక్ష స్తోత్ర పుస్తకాల పంపిణీ

- రామకోటి రామరాజు సేవలు అమోఘం
- దుబ్బాక బాలాజీ దేవాలయ కమిటీ

ప్రతిపక్షం, దుబ్బాక, డిసెంబర్ 7: భద్రాచల దేవస్థాన సీతారాముల కల్యాణానికి రెండు సార్లు గోటి తలంబ్రాలు అందించిన ఘనత దుబ్బాక భక్తుల ఘనత అని రామకోటి సంస్థ కొనియాడి వారికీ తిరిగి భద్రాచల దేవస్థాన శ్రీరామ రక్ష స్తోత్రం పుస్తకాలు, ముత్యాల తలంబ్రాలు ఆదివారం బాలాజీ దేవాలయంలో అందజేశారు. శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు ఈ సందర్భంగా మాట్లాడుతు లోక కల్యాణర్థం శ్రీరామరక్ష స్తోత్రం పారాయణం చేయాలన్నారు. శాశ్వతమైన రామనామం ప్రతి ఒక్కరు లిఖించి తరించాలన్నారు. ఈ సందర్భంగా రామకోటి రామరాజును దేవాలయ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత 30సంవత్సరాల నుండి రామకోటి రామరాజు చేస్తున్న ఆధ్యాత్మిక సేవలు అమోఘం అన్నారు. మా చేతులతో గోటి తలంబ్రాలు భద్రాచలం అందించి తిరిగి ముత్యాల తలంబ్రాలు తీసుకొచ్చి ఇవ్వడం రామకోటి రామరాజు నిస్వార్థ రామభక్తి అభినందనీయం అన్నారు. ఏమి ఆశించకుండా భక్తుల సేవే భగవంతుని సేవగా భావించి చేస్తున్న సేవలు అందరికీ సాధ్యం కాదని రామకోటి రామరాజుకే సాధ్యం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు అచ్చి లక్ష్మీ నర్సింహా చార్యులు, చింత నాగేందర్, ఇంగు శివకుమార్ ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.



పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ మెటీరియల్
పరిశీలించిన కలెక్టర్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 7: హవేలీ ఘన్పూర్ మండల కేంద్రంలో ప్రవేట్ ఫంక్షన్ హాల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్, ఎంపీడీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్, ఎన్నికల సంబంధించిన సామగ్రిని ఎంపీడీవో కలిసి ఆదివారం కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామ పంచాయతీ ఎన్నికల సమర్థవంతంగా నిర్వహించడానికి పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు హవేలి ఘన్పూర్ మండలంలో పర్యటించి ఎన్నికల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలోపరిశీలించామన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల సామగ్రిని పరిశీలించిన కలెక్టర్ పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కోసం చేపట్టిన ఏర్పాట్లను గమనించారు. పోస్టల్ బ్యాలెట్ ఏర్పాట్లను, నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు ఉన్నాయా లేవా అని నిశితంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు స్థానిక అధికారులు ఉన్నారు.



రామంచ గ్రామ సర్పంచ్‌గా భవాని నవీన్ ఏకగ్రీవం

- హర్షం వ్యక్తం చేసిన మాజీ మంత్రి హరీష్ రావు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 7: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రామాల్లో పల్లెప్రగతి విస్తృతంగా జరిగిందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లలో ఆ అభివృద్ధిని నిర్వీర్యం చేసిందని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు విమర్శించారు. చిన్నకోడూరు మండలం రామంచ గ్రామంలో సర్పంచ్‌గా ఎర్ర భవాని నవీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ ప్రజల నిర్ణయాన్ని అభినందించేందుకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావుని నూతన సర్పంచ్ నవీన్, గ్రామ పెద్దలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ... సిద్దిపేట నియోజకవర్గంలో నంగునూరు మండలంలోని ఖాతా, సంతోష్ నగర్, సిద్దిపేట అర్బన్ మండలంలోని బొగ్గులోని బండ, చిన్నకోడూరు మండలంలోని రామంచ గ్రామ పంచాయతీలు సర్పంచ్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా నిలవడం సంతోషకరమని అన్నారు. రామంచ గ్రామం అభివృద్ధిలో ఎల్లప్పుడూ ముందుంటుందని గుర్తుచేసిన హరీష్‌రావు, 20ఏళ్ల క్రితం మొదటి కొనుగోలు ధాన్యం కేంద్రాన్ని రామంచలోనే ప్రారంభించానని అన్నారు. నాగరేశ్వర దేవాలయం-సిరిసిల్ల రోడ్డు కోసం ₹2 కోట్లు,రామంచ-రంగనాయక స్వామి గుట్ట - చంద్లపూర్ రహదారి కోసం ₹2 కోట్లు,రామంచ, చంద్లపూర్, మాచపూర్ చెరువులకు నీరు అందించే రంగనాయక లిఫ్ట్ పనులు త్వరలో పూర్తి కానున్నట్లు వెల్లడించారు.సర్పంచ్ ఎన్నికలలో చూపినట్లే అభివృద్ధిలో కూడా గ్రామం ఐక్యతను ప్రదర్శించాలని సూచిస్తూ, రామంచ గ్రామ అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని హరీష్ రావు హామీ ఇచ్చారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ ఎర్ర భవాని నవీన్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు.



బొగ్గులోని బండ గ్రామ సర్పంచ్ ఏకగ్రీవం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 7: సిద్దిపేట అర్బన్ మండలంలోని బొగ్గులోని బండ (పాండవపురం) గ్రామంలో సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. నూతన సర్పంచ్‌గా ఎంపికైన అందె శంకర్ గ్రామ పెద్దలు గ్రామస్తులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ... గ్రామ ప్రజల ఐక్యతే బొగ్గులోని బండ గ్రామానికి ప్రధాన బలం అని అభినందించారు. ఏకగ్రీవ ఎన్నిక గ్రామ ప్రజల పరస్పర నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి అందరి సహకారంతోనే సాధ్యమవుతుందని, కొత్తగా ఏర్పడిన పాలకవర్గం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామాభివృద్ధికి ఎల్లప్పుడూ తాను సహకారం అందిస్తానని హామీ ఇచ్చిన హరీష్ రావు, కొత్త సర్పంచ్ శంకర్‌ను సన్మానించి, గ్రామస్తులకు శుభాకాంక్షలు తెలిపారు.

రేవంత్ రెడ్డి... సిద్దిపేటకు రా

- రంగనాయకసాగర్‌లో బండ కట్టి నీళ్లోకి దించుతా
- కాంగ్రెస్ పార్టీ బలపరచిన అభ్యర్థులను ప్రజలు ఓడించాలి
- కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తోంది
- మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన హరీష్ రావు



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 7: కాళేశ్వరం ప్రాజెక్టు విషయంపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా బాధించాయని, కేసీఆర్, హరీష్ రావులను బండకేసి కొట్టాలి అని మాట్లాడటం బాధ్యతారహితమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. రేవంత్ రెడ్డి సిద్దిపేటకు రా... రంగనాయకసాగర్‌లో బండ కట్టి నీళ్లోకి దించుతా... నువ్వు మునిగితే కాళేశ్వరం ఉందన్నట్టే... పైకి వస్తే కాళేశ్వరం కూలింది అన్నట్టే అని ఆయన తీవ్రంగా విమర్శించారు. రేవంత్ రెడ్డి అబద్ధాలు, చిల్లర మాటలు మానుకోవాలని హరీష్ రావు వ్యాఖ్యానించారు. సిద్దిపేట జిల్లాలోని చిన్నకోడూరు మండల కేంద్రంలో ఉన్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు రైతుల సమస్యలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులు 50 రోజులుగా 45 కోట్లు బకాయి కోసం ఎదురు చూస్తున్నారని, ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తోందని ఆయన విమర్శించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రెండు రోజుల్లో చెల్లింపులు చేస్తామని చెప్పినా, 50 రోజులు గడిచినా డబ్బులు రావడం లేదని హరీష్ రావు మండిపడ్డారు. యాసంగి పంట పెట్టుబడుల కోసం రైతులు మద్దతు దర కన్నా తక్కువ ధరకు పంట అమ్ముకోవాల్సివస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న రైతులకు బకాయి ఉన్న 450 కోట్లు వెంటనే విడుదల చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. రైతులకు చీరెలు ఇచ్చిన కేసీఆర్ ప్రభుత్వాన్ని గుర్తుచేసుకుంటూ, రేవంత్ రెడ్డి ఒక్కసారి చీరెలు ఇచ్చి ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. మహిళలకు బకాయి ఉన్న 60 వేల రూపాయలు ఇప్పటికీ ఇవ్వలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ బలపరచిన అభ్యర్థులను ప్రజలు ఓడించాలని పిలుపునిచ్చారు. రైతుబంధు, రుణమాఫీ అంశాలను ప్రస్తావిస్తూ వచ్చే ఏడాది పంట వేసే రైతులకు మాత్రమే రైతుబంధు ఇస్తామని తుమ్మల నాగేశ్వరరావు చెప్పడం రైతులకు అన్యాయమని వ్యాఖ్యానించారు. ఇంకా పూర్తి స్థాయిలో రుణమాఫీ అమలు కాలేదని అన్నారు.





కార్మిక చట్టాలను రక్షించాలంటే
ఐక్య ఉద్యమాలే మార్గం

- సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు హేమలత
- సీఐటీయూ 5వ రాష్ట్ర మహాసభలు
- మెదక్‌లో ఘనంగా ప్రారంభం
- భారీ కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ
- ఎర్రజెండాలతో ఎరుపెక్కిన మెతుకు సీమ





ప్రతిపక్షం ప్రతినిధి మెదక్, డిసెంబర్ 07: సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) తెలంగాణ 5వ రాష్ట్ర మహాసభలు మెదక్ జిల్లా కేంద్రంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహాసభల తొలి రోజు జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన వందలాది మంది కార్మికులు పాల్గొన్న భారీ కార్మిక ప్రదర్శన పట్టణాన్ని కుదిపేసింది. మార్కెట్ కమిటీ కార్యాలయం నుండి ప్రారంభమైన ర్యాలీ ఓల్డ్ బస్ స్టాండ్, రాందాస్ చౌరస్తా మీదుగా చిల్డ్రన్ పార్క్ వరకు కొనసాగింది. కళాకారుల డప్పు చప్పుడు, నినాదాలతో ర్యాలీ ఉత్సాహంగా సాగింది. తరువాత చిల్డ్రన్ పార్క్ మైదానంలో సీఐటీయూ రాష్ట్ర మహాసభల చైర్మన్ చుక్క రాములు అధ్యక్షతన భారీ బహిరంగ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు హేమలత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సిపిఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి రాఘవులు, సీఐటీయూ అఖిల భారత కోశాధికారి సాయిబాబా, రాష్ట్ర అధ్యక్షులు పాలమడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య తదితర నాయకులు హాజరయ్యారు. సభలో హేమలత మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు. "దేశంలో ప్రభుత్వ రంగాలలో పనిచేస్తున్న కోటి మంది కార్మికులను కార్మికులుగా గుర్తించడం లేదు. కనీస వేతనాలు కూడా చెల్లించడం లేదు. కార్మికులను వెట్టిచాకిరికి గురిచేస్తున్నారు" అని ఆమె తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లు కార్మిక హక్కులపై నేరుగా దాడి చేస్తున్నాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. "కార్మిక చట్టాలు ఎన్నో పోరాటాల్లో వచ్చినవి. వాటిని మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కాలరాస్తోంది. ఐక్య ఉద్యమాల ద్వారానే ఇవి నిలువరించగలం," అని హేమలత హితవు పలికారు. 2019లో లేబర్ కోడ్లను సీఐటీయూ భారీ స్థాయిలో వ్యతిరేకించడంతో ఇంకా అమలులోకి రాలేదని ఆమె పేర్కొన్నారు. కార్మిక సంక్షేమ పథకాలను అమలు చేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను ఇప్పటికీ పట్టించుకోకపోవడాన్ని ఆమె తీవ్రంగా విమర్శించారు.

రైతు–కార్మిక ఐక్యతతోనే విజయం సాధ్యం: రాఘవులు

రాఘవులు మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్లను కార్మిక వర్గం మాత్రమే కాదు, రైతులు కూడా వ్యతిరేకించారని గుర్తించి, భవిష్యత్తులో రైతు-కార్మిక ఐక్య ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ రాజకీయ పార్టీల వైఖరిపైనా ఆయన విమర్శలు చేసారు.

"లేబర్ కోడ్లపై కేటీఆర్ వ్యతిరేకించినా ప్రత్యక్షంగా ఉద్యమాల్లో పాల్గొనలేదు. పార్లమెంటులో బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. కాంగ్రెస్ ఢిల్లీలో ఒక తీరు, రాష్ట్రంలో మరో తీరు మాట్లాడుతోంది," అని వ్యాఖ్యానించారు.


నాయకుల ప్రసంగాలు, భారీ హాజరు

సీఐటీయూ రాష్ట్రనాయకులు భాస్కర్, వీరయ్య, మల్లికార్జున్ తదితరులు కార్మికులపై జరుగుతున్న అన్యాయాలను తీవ్రంగా ఖండిస్తూ మాట్లాడారు. మెదక్ జిల్లా సీఐటీయూ నాయకులు మల్లేశం, బాలమణి, టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు దొంతి నరేందర్, సిపిఎం నాయకులు నర్సమ్మ, సంతోష్, నాగరాజు, బసవరాజ్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మహాసభలకు ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుండి వేలాదిగా కార్మికులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



ఒక్కసారి అవకాశం ఇవ్వండి

- నిజాంపేట బీజేపీ అభ్యర్థి చలిమేటి నరేందర్



ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 7: మెదక్ జిల్లా నిజాంపేట్ గ్రామ బీజేపీ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి చెలిమిటి నరేందర్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. గ్రామంలో ఏ ఆపద వచ్చినా నేనున్నానంటూ ముందుండే నరేందర్.. గ్రామంలో ఎవరు ఆపదలో ఉన్న అండగా ఉండి ఆర్థిక సహాయం చేస్తూ, బాధిత కుటుంబాలకు బియ్యం అందజేసి భరోసా కల్పించేవారు. నిజాంపేట్ గ్రామంలో వివిధ వార్డులో నరేందర్ ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఆదివారం ఇంటింటి ప్రచారంలో భాగంగా తనను గెలిపించాలని గ్రామస్తులను కలుస్తూ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. తనను సర్పంచ్ గా గెలిపిస్తే నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవకే పునరాంకితమవుతానని పేర్కొన్నారు. గ్రామానికి సేవ చేసే అవకాశాన్ని ఇవ్వలని అభివృద్ధి చేసి చూపిస్తానని పేర్కొన్నారు. సర్పంచ్ అంటే హోదా కాదు గ్రామానికి సేవ చేసే ఒక బాధ్యత అని మీ సేవకుడిగా పనిచేసే అవకాశం ఇవ్వండి అని ప్రజలను వేడుకున్నారు. గ్రామ ప్రజల ఆశీస్సులు,గ్రామ పెద్దల సహకారంతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమంలో నిరంతరంగా కొనసాగిస్తానని హామీ ఇచ్చారు.



'భారత రాజ్యాంగం–విలువలు' పుస్తక ఆవిష్కరణ

ప్రతిపక్షం, సిద్దిపేట, డిసెంబర్ 7: సిద్దిపేటలోని సరస్వతీ శిశు మందిర్‌లో రాజ్యాంగ దినోత్సవ పక్షోత్సవాల సందర్భంగా సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగం-విలువలు' పుస్తకాన్ని జిల్లా అధ్యక్షులు డా. ఏ. అరవింద్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని 15, 16, 17 ఆర్టికల్‌లు సమానత్వం, సోదరభావం, న్యాయం వంటి మౌలిక హక్కులను అందిస్తున్నాయని తెలిపారు. సామాజిక సమరసత వేదిక రాష్ట్ర వ్యాప్తంగా కుల-మత విభేదాలు లేని సమాజ నిర్మాణం, ముఖ్యంగా సంచారజాతుల హక్కుల రక్షణ కోసం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. సంచారజాతుల కొన్ని కులాల పేర్లు ఇంకా ప్రభుత్వ రికార్డుల్లో లేవని, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో రమేష్, మనోహర్, సంతోష్, మల్లారెడ్డి, విజయ భాస్కర్, శ్రీకాంత్, శ్రీనివాస్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు

"



టీఎంసీ బహిష్కృత నేత హుమాయున్ కబీర్‌పై బెంగాల్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. బాబ్రీ తరహా మసీదు నిర్మాణం పేరుతో దేశంలో విద్వేషపూరిత వాతావరణం సృష్టించడమే టార్గెట్‌గా కామెంట్లు చేశారు. మసీదు నిర్మించుకోవచ్చు. దాని పేరుతో రాజకీయాలు చేయొద్దు. ఈ వివాదం వెనుక బీజేపీ ఉంది. 2019 ఎన్నికల్లో బీజేపీ తరపున కబీర్ పోటీ చేశారు.

- కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్

ప్రాంతీయం

కిషన్‌రెడ్డికి తెలంగాణ గురించి మాట్లాడే అర్హత లేదు

- పీసీసీ చీఫ్ మహేష్



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 7 : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి తెలంగాణ లో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, అభివృద్ధి పై మాట్లాడే అర్హత లేదని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పర్యటించిన తన నివాసంలో తనను కలిసిన విలేకరుల తో మాట్లాడుతూ కేంద్రమంత్రిగా ఉండి మన రాష్ట్రానికి కిషన్ రెడ్డి చేసేందేమీ లేదన్నారు. పైగా రెండు సంవత్సరాలలో కాంగ్రెస్ అన్నిరంగాలు వైఫల్యం పై హైదరాబాద్ ధర్నా చౌక్ లో కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ బీజేపీ నాయకులు మహాధర్నా నిర్వహిస్తామనడం హాస్యాస్పద మన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ రెండు సంవత్సరాల పాలన చూసిన ప్రజలు శభాష్ అంటున్నారని పీసీసీ చీఫ్ పేర్కొన్నారు. ఇందుకు ఇటీవల జూబ్లీహిల్స్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీతో గెలుపు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. జూబ్లిహిల్స్‌లో కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేని బీజేపీ ప్రతినిధులు మాట్లాడేముందు ఆలోచించి మాట్లాడాలని హితవు పలికారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో గర్వంగా గ్లోబల్ సమ్మిట్ జరుపుకుంటున్నామని పీసీసీ అధ్యక్షుడు తెలిపారు. కేసీఆర్ చేసిన నిర్వాకం కారణంగా రాష్ట్రం రూ.8లక్షల కోట్ల అప్పుల్లో ఉందన్నారు. ఒకవైపు వడ్డీలు కడుతూ మరోవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. తమ పాలన మరో మూడేళ్లు ఉందని, ఆ లోపు ఇచ్చిన హామీలన్ని నెరవేరుస్తామని స్పష్టం చేశారు.

నేటి నుంచి నిజాంసాగర్ నీరు విడుదల



ప్రతిపక్షం, బాన్సువాడ, డిసెంబర్ 7: నిజాంసాగర్ ప్రాజెక్ట్ నుండి ప్రధాన కాలువకు సోమవారం ఉదయం 08:00 గంటలకు రబీ (యాసంగి పంట) కొరకు (2025 26) నీటిని విడుదల చేస్తున్నట్లు నిజాంసాగర్ ఇరిగేషన్ డి ఈ ఈ తెలిపారు. ఈ నీటిని వృధా చేయకుండ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధిక ప్రవాహం వలన కాలువ లోకి పశువులు, గొర్రెలు వెళ్లకుండా, కాపరులు , పిల్లలు, రైతులు వెళ్లకుండా అప్రమత్తం గా ఉండాలని కోరారు. నిజాంసాగర్ ప్రాజెక్ట్ కాలువ పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని పోలీస్, రెవెన్యూ అధికారులకు, ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.



పంచాయతీల బలోపేతమే సర్కార్ లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 7: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్వీర్యమైన పంచాయతీలను పటిష్టం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం గన్నేరువరం మండలంలోని పార్వెల్ల, గన్నేరువరం, చొక్కారావుపల్లి, యాస్వాడ, సాంబయ్యపల్లి మాదాపూర్, జంగపల్లి, గునుకుల కొండాపూర్, చీమలకుంటపల్లి గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసిందని, పంచాయతీలకు సంబంధించిన నిధులు ఇతర పనులకు మళ్లించి ఆ వ్యవస్థను పూర్తిగా బలహీనపర్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్నదన్నారు. పంచాయతీలకు ఆర్థిక పుష్టి కల్పిస్తున్నదని, గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నదని ఆయన చెప్పారు. మంచి పనులు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 14న జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో సర్పంచులు, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులకు మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ ప్రచార కార్యక్రమాల్లో గన్నేరువరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, పార్టీ నాయకులు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, బుర్ర తిరుపతి గౌడ్, అరికాంతం గోపాల్ రెడ్డి, కటకం తిరుపతి, సంగు లక్ష్మి దేవయ్య బొడ్డు సునిల్, జువ్వాడి మన్మోహన్ రావు, సిహెచ్ శ్రీధర్ రెడ్డి, మాతంగి అనిల్, నల్ల చంద్రారెడ్డి, ఈగ రాజయ్య, ఎం తిరుపతిరెడ్డి, మామిడిపల్లి అంజయ్య, గడ్డం మహిపాల్ రెడ్డి, గంగాధర అంజి, వరుకోలు వెంకట్, నాగపురి శంకర్, బామండ్ల అంజితోపాటు సర్పంచ్, వార్డు అభ్యర్థులు పాల్గొన్నారు.



బీజేపీ నుండి మాజీ సర్పంచ్ సస్పెన్షన్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 7: కరీంనగర్ రూరల్ మండలం ఆసిఫ్ నగర్ (బావు పేట) మాజీ సర్పంచ్ కడారి శ్రీనివాస్ ను భారతీయ జనతా పార్టీ సస్పెండ్ చేసింది. ఈ మేరకు శనివారం రోజున కొత్తపల్లి రూరల్ మండల అధ్యక్షులు కుంట తిరుపతి ఆయనను సస్పెండ్ చేస్తూ ప్రకటన విడుదల చేశారు. కడారి శ్రీనివాస్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందుకు పార్టీ నుండి సస్పెండ్ చేసినట్లు కుంట తిరుపతి తెలిపారు. కడారి శ్రీనివాస్ ప్రాథమిక సభ్యత్వాన్ని కూడా రద్దుచేసి , తగిన చర్యలు తీసుకోవాలని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంటు సభ్యులు, కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్, జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డిని కోరినట్లు తెలిపారు. శౌర్య దినోత్సవం సందర్భంగా నాటి కరీంనగర్ కర సేవకులు కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్, బిజెపి సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్ లను కరీంనగర్ మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేష్ ఘనంగా సన్మానించారు.



ఎన్నికల నియమాలను ఉల్లంఘిస్తే చర్యలు

- దుబ్బాక సీఐ శ్రీనివాస్

ప్రతిపక్షం, మిడిదొడ్డి, డిసెంబర్ 7: ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దుబ్బాక సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా మిడిదొడ్డి మండల కేంద్రంలోని ఓ వేడుక మందిరంలో రెండో విడత స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలో నిలిచిన సర్పంచి, వార్డు సభ్యుల అభ్యర్థులకు ఎన్నికల ప్రవర్తన నియమావళిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఓటరును ప్రలోభాలకు గురిచేస్తే సహించమన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజల చేత ఎన్నుకోబడాలన్నారు. ర్యాలీలు, సమావేశాలకు అనుమతులు ముందస్తుగా తీసుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి జగదీశ్వర్, ఎంపీడీవో గణేష్‌రెడ్డి, ఎస్ ఐ సమత, ఉప తహసిల్దారు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో బాబ్రీ మెమోరియల్

- ప్రకటించిన తెహ్రీక్ ముస్లిం షబ్బన్



ప్రతిపక్షం, నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లో బాబ్రీ మసీదు తరహాలో కట్టడం నిర్మిస్తామని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ అయిన ఎమ్మెల్యే హుమయూన్ కబీర్ ఇటీవల ప్రకటించిన క్రమంలో అన్ని సౌకర్యాలతో గ్రేటర్ హైదరాబాద్‌లో బాబ్రీ స్మారకం నిర్మిస్తామని హైదరాబాద్‌కు చెందిన ముస్లిం సంస్థ ఒకటి ప్రకటించింది. బాబ్రీ మసీదు కూల్చివేత జరిగి 33 ఏళ్లయిన సందర్భంగా ఈనెల 6న జరిగిన బహిరంగ సమావేశంలో తెహ్రీక్ ముస్లిం షబ్బాన్ అధ్యక్షుడు ముస్తాఖ్ మాలిక్ తాజా ప్రకటన చేశారు. బాబ్రీ యానివర్సిటీతో పాటు రొటీన్ పబ్లిక్ మీటింగ్‌లో గ్రేటర్ హైదరాబాద్‌లో బాబ్రీ మసీదు మెమోరియల్ నిర్మించాలనే నిర్ణయం తీసుకున్నట్టు ఆయన చెప్పారు. ఈ మెమోరియల్‌లో కొన్ని సంక్షేమ సంస్థలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఏ విధంగా దీన్ని నిర్మిస్తాం, ఎప్పుడు నిర్మిస్తాం అనే వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు. రాముడి పుట్టిన జన్మస్థలంలో మసీదు కట్టడంపై చిరకాలంగా వివాదం కొనసాగడంతో బాబ్రీ మసీదును 1992లో కరసేవకులు కూల్చేశారు. రామమందిర నిర్మాణానికి 2019లో సుప్రీంకోర్టు మార్గం సుగమం చేయడంతో అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణం జరిగింది. ప్రధాని నరేంద్ర మోదీ దీనిని ప్రారంభించడంతో పాటు ఇటీవల ధ్వజారోహణ నిర్వహించారు.

బాబర్ పేరుతో కట్టడాలను వ్యతిరేకిస్తాం

కాగా, సస్పెండెడ్ టీఎంసీ ఎమ్మెల్యే హుమయూన్ కబీర్ శనివారం ముర్షిదాబాద్‌లో బాబ్రీ మసీదు తరహాలో కట్టడం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేరోజు హైదరాబాద్‌లో బాబ్రీ మెమోరియల్ ప్రకటన వెలువడటం ఆసక్తికరం. బెంగాల్‌లో బాబ్రీ మసీదు శంకుస్థాపన వ్యవహారంపై బీజేపీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. పశ్చిమబెంగాల్ ప్రభుత్వం పోలరైజేషన్‌కు పాల్పడుతోందని, బాబర్ పేరుతో ఎలాంటి కట్టడాన్నయినా భారత్ వ్యతిరేకిస్తుందని అన్నారు. అయితే బీజేపీ వాదనను హుమయూన్ కబీర్ తోసిపుచ్చారు. తాము రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఏమీ చేయడం లేదని చెప్పారు. ఎవరైనా మందిరం, చర్చి నిర్మించుకోవచ్చని, తాను మసీదు నిర్మిస్తున్నానని చెప్పారు. రూ.300కోట్ల అంచనా వ్యయంతో ఈ నిర్మాణం చేపడతామని, అందులో ఒక ఆసుపత్రి, గెస్ట్ హౌస్, మీటింగ్ హాల్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.



భారమైన 'అమ్మ'

- ఆర్డీవో ఆఫీస్ లోనే వదిలి వెళ్లిన కొడుకులు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ డిసెంబర్ 7: కని, పెంచిన అమ్మ భారమైంది. కుమారులు ఆమెను వదిలించుకోవాలనుకున్నారు. దీంతో ఏకంగా ఆర్డీవో కార్యాలయంలోనే తల్లిని వదిలి వెళ్లిపోయారు. జగిత్యాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. మల్యాల మండలానికి చెందిన కుర్రె లక్ష్మికి ఇద్దరు కుమారులు కృష్ణ, శ్రీనివాస్ ఉన్నారు. ఒకరు జగిత్యాలలో.. మరొకరు మల్యాలలో ఉంటున్నారు. లక్ష్మి భర్త నారాయణదాస్ గతంలోనే మృతిచెందాడు.ఆస్తిపంపకాల్లో గొడవ రావడంతో సమస్య పరిష్కారానికి శనివారం ఉదయం తల్లితో పాటు కుమారులు ఆర్డీవో కార్యాలయానికి వచ్చారు. అనంతరం తల్లిని అక్కడే వదిలి వెళ్లిపోయారు. సాయంత్రమైనా కొడుకులు రాకపోవడంతో ఆ వృద్ధురాలు చలిలోనే కార్యాలయం ఆవరణలో ఉండిపోయింది. ఇది గమనించిన ఆర్డీవో వెంటనే ఆమె కొడుకులకు ఫోన్ చేసి తల్లిని వెంటనే తీసుకెళ్లాలని, సోమవారం ఇద్దరూ కలిసి తన కార్యాలయంలో హాజరుకావాలని ఆదేశించారు. వెంటనే పెద్ద కొడుకు కృష్ణ వచ్చి తల్లిని తీసుకెళ్లాడు.

ఓఆర్ఆర్ పై రోడ్డు ప్రమాదం.. తండ్రి, కూతురు మృతి



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 7 : తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పాటి గ్రామ సమీపంలో ఓఆర్ఆర్ పై ఎగ్జిట్ 2 సమీపంలో శనివారం అర్ధరాత్రి లారీ కారును ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందినారు. ఒకే కారులో రెండు కుటుంబాలు భార్య, పిల్లలతో మేడ్చల్ నుంచి తిరుపతి వెళ్తున్న శ్రీశైలం మరియు తిరుపతి కుటుంబ సభ్యులు. వీరంతా సమీప బంధువులు కలిసి ప్రయాణం చేస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది.ఈ ప్రమాదంలో శ్రీశైలం(40), అతని కూతురు సుభిక్ష (4) అక్కడికి అక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎసై లక్ష్మా రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు తో బీడీఎల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరెంటు స్తంభానికి ఢీకొన్న బైకు.. వ్యక్తి మృతి



ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, డిసెంబర్ 7: మక్తల్ నియోజకవర్గం, అమరచింత పట్టణం నుంచి ఆత్మకూరు కు వెళుతున్న నవీన్ 32 సంవత్సరాలు అనే వ్యక్తి మద్యం సేవించి, కానాపురం సమీపంలో రోడ్డు పక్కన ఉన్న కరెంటు పోలుకు వేగంగా బైకుపై వెళ్తూ, ఢీకొనడంతో అక్కడక్కడ మృతి చెందాడు. ఈయన సొంత గ్రామం నర్వ మండలం, రాయకోడ్ కాగా గత మూడు సంవత్సరాలుగా ఆత్మకూరు సీనియర్ న్యాయమాది దగ్గర పని చేస్తున్నాడని సమాచారం ఉంది. ఈయనకు ముగ్గురు పిల్లలు ఉన్నారని వారి కుటుంబ సభ్యులు తెలిపారు.



ఎస్ఎస్టీ చెక్ పోస్ట్‌ను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్

ప్రతిపక్షం, రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 7: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదివారం పరిశీలించారు. వేములవాడ రూరల్ మండలంలోని ఫాజుల్ నగర్ వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్ టీ చెక్ పోస్ట్ ను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తనిఖీ చేశారు. రిజిస్టర్లు పరిశీలించి, వాహనాల తనిఖీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెక్ పోస్ట్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వాహనాల తనిఖీలో క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు.



అధికార పార్టీ బలపరుస్తున్న అభ్యర్థులనే గెలిపించండి

- నిర్మల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి కే శ్రీహరి రావు

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్ డిసెంబర్ 7: అధికార పార్టీ అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు అవ్వాలని కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జి కూచాడి శ్రీహరి రావు అన్నారు. మామడ మండలం గాయిద్ పల్లి, గోండుగూడ, తాటిగూడ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల తరపున ఇంటింటికి వెళ్లి ఆదివారం ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల పార్టీ అని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం రేవంత్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందని తెలిపారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



చిల్కానగర్ ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలకు నిధులు కేటాయించండి

- కార్పొరేటర్ గీతా ప్రవీణ్ ముదిరాజ్

ప్రతిపక్షం, సిటీ బ్యూరో, డిసెంబర్ 7 : చిల్కానగర్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ శనివారం తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలాస్ ని తన కార్యాలయంలో కలిసి చిల్కానగర్ ఎంపీపీ ఎస్ ప్రభుత్వ పాఠశాలకు అదనపు గదుల కొరకు నిధులు కేటాయించాల్సిందిగా 2024 డిసెంబర్ మాసంలో గతంలో ఉన్న డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ నరసింహారెడ్డికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని అని తెలుపుతూ, దానికి సంబంధిత ప్రొసీడింగ్ పేపర్ ని కూడా కార్పొరేటర్ గీతా ప్రవీణ్ నవీన్ డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ నికోలస్ కు చూపిస్తూ చిల్కానగర్ ప్రభుత్వ పాఠశాల శిథిలా అవస్థకు చేరిందని, పాఠశాల పిల్లలకు అదనపు గదులు లేక చాలా ఇబ్బంది పడుతున్నారని, వెంటనే పాఠశాల అదనపు గదులకు నిధులు కేటాయించాల్సిందిగా కోరడం జరిగింది. డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్ సానుకూలంగా స్పందిస్తూ ఈ ఆర్థిక సంవత్సరంలో కచ్చితంగా నిధులు కేటాయించే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.



కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి బీజేపీ నేతల వినతి

ప్రతిపక్షం, చిట్యాల, డిసెంబర్ 7: నల్గొండ జిల్లా చిట్యాల పట్టణంలోని జాతీయ రహదారిపై జరుగుచున్న పై వంతెన నిర్మాణ పనులను త్వరితంగా పూర్తి చేయించాలని కోరుతూ చిట్యాల బీజేపీ నాయకులు ఆదివారం నల్గొండకు వచ్చిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం అందించారు. గత కొద్ది రోజులుగా పనులు మందకొడిగా సాగుతున్నాయని దీంతో స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సర్వీసు రోడ్లలో వాహనాల రద్దీ పెరగడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని దుమ్ము ధూళి వల్ల దుకాణదారులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. వినతి పత్రం అందించిన వారిలో చిట్యాల పట్టణ పార్టీ అధ్యక్షుడు గుండాల నరేష్ గౌడ్, సీనియర్ నాయకులు కన్నెబోయిన మహాలింగం యాదవ్, గంజి గోవర్ధన్, కన్నెబోయిన మురళీకృష్ణ ఉన్నారు.



గ్లోబల్ సమ్మిట్‌కు భద్రతా పరంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. 6 వేల మంది పోలీసులతో మూడంచెల భద్రత, వెయ్యి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. రెండు రోజుల తర్వాత పబ్లిక్‌కు అనుమతి ఉంటుంది. డెలిగేట్స్‌కు పైలట్ వాహనాలను ఏర్పాటు చేశాం. సమ్మిట్ జరిగే రోజుల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి. శ్రీశైలం నుంచి వచ్చే వాహనాలు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలి.

- రాచకొండ సీపీ సుధీర్ బాబు



1650కి పైగా విమానాలు నడుస్తున్నాయ్

- **ఇండిగో సీఈవో ఎల్బర్స్**

దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో సంక్షోభం నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్నది. కార్యకలాపాలను వేగంగా సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇటీవల సంక్షోభం నేపథ్యంలో పరిస్థితిని మెరుగుపరిచేందుకు కంపెనీ చర్యలు చేపట్టింది. కంపెనీ ఆదివారం సుమారు 1650కి పైగా విమానాలను నడుపుతుందని సీఈవో పీటర్ ఎల్బర్స్ పేర్కొంది. ఇండిగో బృందం క్రమంగా సేవలను పునరుద్ధరిస్తోందని, ప్రయాణీకులకు మెరుగైన అనుభవం అందించేందుకు ప్రతి స్థాయిలో పనిచేస్తోందని ఎల్బర్స్ తెలిపారు. రాబోయే రోజుల్లో కార్యకలాపాలు పూర్తి సాధారణ స్థితికి వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దశలవారీగా పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. పైలట్ల కొరత, షెడ్యూల్‌లో అంతరాయం కారణంగా ఎయిర్‌లైన్ కంపెనీ ఇబ్బందులను ఎదుర్కొన్నది. అయితే, పరిస్థితి అదుపులో ఉందని.. విమానాల సంఖ్య పెరుగుతోందని యాజమాన్యం చెప్పుకొచ్చింది. అయితే, ఇండిగో దేశవ్యాప్తంగా 3వేలకు పైగా ప్రయాణికుల బ్యాగులను డెలివరీ చేసిందని పౌర విమానయాన మంత్రిత్వశాఖ పేర్కొంది. ప్రయాణికుల లగేజీని తిరిగి వారికి అందజేసే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని పేర్కొంది. దాంతో పాటు ఇండిగో ఇప్పటి వరకు రూ.610 కోట్లకు పైగా రీఫండ్స్‌ను ప్రాసెస్ చేసిందని మంత్రిత్వశాఖ పేర్కొంది. విమానాల రద్దు, ఆలస్యం తర్వాత ఈ మొత్తాన్ని ప్రయాణికులకు చెల్లించాలని మంత్రిత్వశాఖ ఆదేశించింది. విమానయాన సంస్థ ప్రయాణీకుల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తుందని మంత్రిత్వశాఖ పేర్కొంటున్నది. మరో వైపు ఇండిగో పైలట్ల పేరుతో సోషల్ మీడియాలో ఓ బహిరంగ లేఖ వైరల్‌గా మారింది. సీఈవో పీటర్ ఎల్బర్స్ సహా పలువురు ఉన్నతాధికారులు విమానయాన సంస్థను పతనం అంచుకునకు నెట్టారని ఆరోపించారు.

విశ్వ వీక్షణం




ఎడారి వసంతం-30



ముక్కెర సంపత్ కుమార్

హుస్నాబాద్



> **జరిగిన కథ 2:**
>
> **హార్డ్ డిస్క్ లో ఉన్న కోడ్ ను డీకోడ్ చేసి, క్లూ వెతికే ప్రయత్నంలో ఉంటాడు ఇంటెలిజెన్స్ ఆఫీసర్ సంపత్. తల్లిదండ్రులు లేని అతులిత్ ను తన స్వార్థం కోసం క్రమశిక్షణ లేకుండా రౌడీలా తయారు చేస్తుంది నాగరత్నం. గోల్డెన్ స్వాన్ హోటల్లో సంగీత్ ప్రోగ్రాం సజావుగా జరగడం కోసం గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తుంది జ్వాలాముఖి.**
>
> **(ఇక చదవండి)**

సాయంత్రం నుంచి సంపత్ కంప్యూటర్ తోనే కుస్తీ పడుతున్నాడు. రాత్రి 4 గంటలు దాటింది. సమయం మంచు ముక్కలా కరిగిపోతూనే ఉంది. అతని మనసు పరిపరి విధాల ఆలోచిస్తూనే ఉంది. రకరకాలుగా ఆలోచించాడు. ఇంతలో మరో ఒక చిన్న ఆలోచన వచ్చింది. కోడ్ లో ఉన్న ఒక్కొక్క అక్షరాన్ని క్లిక్ చేసి చూస్తే ఏదైనా క్లూ దొరుకుతుందేమోనని ఒక అనుకున్నాడు.
S5P2VJ21A2 కోడ్ లో ఉన్న మొదటి అక్షరం S కనుక కీ బోర్డ్ లో S ని ప్రెస్ చేశాడు. నో రెస్పాన్స్. కాస్త నిరాశ చెంది, వెంటనే 2వ అక్షరం 5 పైన ప్రెస్ చేశాడు. అయినా అక్కడ ఏమీ ఫలితం కనబడలేదు. దాంతో తను మళ్ళీ నిరాశ పడ్డాడు. కానీ పట్టు వదలని విక్రమార్కుడి లాగా కోడ్లో ఉన్న ఒక్కొక్క అక్షరాన్ని ప్రెస్ చేస్తూ డీకోడ్ చేసే ప్రయత్నం చేశాడు. అతని ప్రయత్నం ఫలించింది. కోడ్ లో ఉన్న J అక్షరాన్ని ప్రెస్ చేశాడు. ఆశ్చర్యం స్క్రీన్ పై ఏదో పేరు ప్రత్యక్షం కాసాగింది. సంపత్ సంభ్రమంతో చూస్తున్నాడు. కంప్యూటర్ స్క్రీన్ పైన "జాకాల్" అనే పేరు పక్కనే ఒక కారు బొమ్మ కనిపించాయి.
కోడ్ డీకోడ్ అయినందుకు తను రిలీఫ్ అయ్యాడు. కానీ ఈ జాకాల్ ఎవరై ఉంటారు. పైగా ఈ కార్ బొమ్మ ఏంటీ!? ఇది ఏమైనా కార్ల కంపెనీకి సంబంధించిన కోడ్ ఆ...జాకాల్ ఎవరిదైనా పేరా...ఏదైనా సంస్థ పేరా... సంఘవిద్రోహక ముఠా పేరా.. ఆలోచనలు కందిరీగల్లా ముసురుతున్నాయి. మొబైల్ లో టైం చూశాడు. వేకువజాము 5 అవుతోంది. వెంటనే జ్వాలాముఖికి డయల్ చేశాడు. జ్వాల ఫోన్ ఎత్తగానే సంపత్ ఉత్సుకతతో చెప్తున్న మాటలు విని "సరే సార్! మనం ఇద్దరం హరి సుందరీల ఫంక్షన్ లో కలిసి, అక్కడ డిస్కస్ చేద్దాం. మీరు 7 గంటల వరకు అక్కడికి రండి. బై సార్" అంటూ ఫోన్ కట్ చేసి పోలీస్ స్టేషన్ కి బయలుదేరింది. స్టేషన్ లో పోలీసుల థర్డ్ డిగ్రీతో హడలిపోయి బిక్క మొఖాలు వేసుకొని ఉన్న కృష్ణ, శ్యామ్, సామ్రాట్ ల దగ్గరకు వెళ్ళింది. వాళ్ళని చూడగానే ఆమెకు ఎందుకో జాలి కలిగింది.
అందుకే వాళ్లను అనునయిస్తూ "చూడండి. జరిగిందేదో జరిగి పోయింది. మీరు ఇకనైనా మంచిగా మారండి. నేరం ఒప్పుకున్నారు కనుక శిక్ష కూడా తగ్గే అవకాశం ఉంది" అన్నాడు. వాళ్లంతా పశ్చాత్తాపంతో తలదించుకున్నారు. ఆమె వెళ్ళి కుర్చీలో కూర్చుంది. ఎస్సై వచ్చి సెల్యూట్ చేశాడు. ఆమె తల ఊపి "ఎఫ్ఐఆర్ పకడ్బందీగా రాసి ఈ ముగ్గురినీ కోర్టులో ప్రొడ్యూస్ చేసి సబ్ జైల్ కి తీసుకెళ్ళ" మని ఆర్డర్ వేసింది.

****

గోల్డెన్ స్వాన్ హోటల్ కం ఫంక్షన్ హాల్ కిటకిటలాడే జనంతో కళకళలాడుతోంది. సంపత్, జ్వాలాముఖి ఒక గదిలో కూర్చుని ఉన్నారు. డీకోడ్ లో దొరికిన క్లూ గురించి చర్చిస్తున్నారు. "జాకాల్... ఈ పేరు ఎక్కడో విన్నట్లుంది సార్, మన క్రిమినల్ టీంలో ఎవరికో ఈ పేరు ఉంది" అంది ఆలోచిస్తూ. అతనికి కాస్త ఆసక్తి కలిగింది. వెంటనే "అవునా, ఎవడు వాడు గుర్తు తెచ్చుకో" అని రెట్టించాడు. 'జాకాల్... జాకాల్' ఆమె ఆలోచిస్తోంది.. ఇంతలో వాళ్ళ రూంలో ఉన్న పరదామాటున ఎవరో కదలినట్లు అనిపించింది. సంపత్ వెంటనే అప్రమత్తమై "జ్వాలా! ఆ కర్టెన్ పక్కన ఎవరో కదులుతున్నారు చూడు" అన్నాడు. కానీ ఇంతలోనే ఒక్కసారిగా లైట్లన్నీ ఆఫ్ అయ్యి చీకట్లు కమ్ముకున్నాయి.
రూంలో నుంచి ఎవరో పారి పోయినట్లు గమనించారు. కానీ ఆ చీకట్లో వాళ్ళు అగంతకున్ని పట్టుకోలేకపోయారు. సరిగ్గా 10 సెకండ్లలో లైట్లు మళ్లీ వెలిగాయి. 'పారిపోయింది ఎవరో, కనిపెట్టలేకపోయామే' అని సంపత్, జ్వాలలు చాలా బాధపడ్డారు. ఆ కర్టెన్ లాగి చూసారు. అక్కడ ఒక మాస్క్ లాంటి తెల్లని రుమాలు కనిపించింది. వెంటనే సంపత్ కి ఒక ఆలోచన వచ్చింది. జ్వాల చెవిలో చెప్పాడు. జ్వాల ఫోన్ తీసి నెంబర్ డయల్ చేసి '20నిమిషాల్లో తమ ఎదుట డాగ్ స్క్వాడ్, మరికొంత పోలీసు ఫోర్స్ పంపించాల'ని ఆదేశాలు జారీ చేసింది.

***

ఫంక్షన్ లో పెద్ద దిక్కుగా ఉండి పనులన్నీ చేపిస్తోంది సుగుణమ్మ. మెహందీ, సంగీత్ పేరుతో టైం అంతా వృధావుతోందని ఆమె భావించింది. అసలే గడియ గడియకి ఏదో ఒక ప్రమాద సంకేతం తెలుస్తోంది. ఆ గుంపులో సూర్య ఎక్కడ ఉన్నాడా అని వెతికి అతని దగ్గరకు వెళ్ళింది. ఏదో పనిలో నిమగ్నమైన సూర్య అమ్మ వాలకాన్ని చూసి కంగారు పడ్డాడు. అమ్మకి మళ్ళీ ఏమైనా హెల్త్ ప్రాబ్లమా అనుకుని చేస్తున్న పనిని ఆపి అమ్మ చెంతకు చేరాడు. ఆమెను దగ్గరకు తీసుకుని నుదుటి మీద చేత్తో తడిమి చూసాడు. కొడుకు కంగారు సుగుణమ్మకి అర్థమైంది. ఆమె నవ్వుతూ "నాయనా! నాకేం కాలేదు, బానే ఉన్నా. కానీ ఈ ఫంక్షన్లో ఎటు నుండి ఏ ఆపద వస్తుందో తెలియడం లేదు. నా మాట విని మెహందీ, సంగీత్ కార్యక్రమాలు పక్కనపెట్టి డైరెక్ట్ పెళ్ళికి ఇప్పుడే అన్నీ సిద్ధం చెయ్యండి" అంది. సూర్య ఆలోచనలో పడ్డాడు. 'అవును అమ్మ చెప్పింది బాగుంది. కావల్సిన బంధువులు అందరూ ఎలాగూ వచ్చారు. ఇది మంచి ముహూర్తమే. చేసేయొచ్చు' అనుకుని, అదే మాటను సంపత్ తో చర్చించాడు. తను కూడా సరే అనడంతో అదే విషయం అందరికీ వినపడేలా బిగ్గరగా చెప్పి, వెంటనే పెళ్ళికి సిద్ధం చేయించాడు.

**

సామ్రాట్ దగ్గర డ్రైవర్ గా పనిచేసేవాడే జాకాల్ అలియాస్ జీవిత్. అతనికి అతులిత్ ఫోన్ చేసి, 'ఎల్లుండి జరగాల్సిన హరి, సుందరి పెళ్లి ఇప్పుడే జరపాలని డిసైడ్ అయ్యారు, అందుకే సంగీత్ ను రద్దు చేశారని కొద్దిక్షణాల్లోనే పెళ్లి జరుగుతుందని కూడా చెప్పాడు. దానితో ఇదే మంచి తరుణం, వాళ్ళ మీద కక్ష తీసుకునే అవకాశం మళ్లీ రాదు అనుకున్నాడు జాకాల్. పేదరికంలో పుట్టి, చిన్ననాడే తల్లిదండ్రులను కోల్పోవడం, నా అన్నవాళ్లు ఎవరూ ఆదరించక పోవడంతో క్రమశిక్షణ లేకుండా పెరిగాడు. జులాయిగా మారి క్రమంగా సామ్రాట్ పంచన చేరి ఆయన క్రిమినల్ యాక్టివిటీస్ లో పాలు పంచుకుంటూ పోలీసులకు దొరకకుండా తప్పించుకోవడంలో చాకచక్యం ప్రదర్శించేవాడు. అంతేకాకుండా గారడీ మాటలతో తనకు భూతవైద్యం వచ్చని అమాయకులను దోచుకునేవాడు.


******

డాగ్ స్క్వాడ్, పోలీసుల బృందం గోల్డెన్ స్వాన్ కు చేరుకుంది. ఫంక్షన్ హాల్ పరిసర ప్రాంతాలను తమ ఆధీనంలోకి తెచ్చుకొని సీక్రెట్ గా నిఘా పెట్టారు. అతులిత్ సమాచారంతో జాకాల్ ఈ అవకాశం వినియోగించుకోవాలని, తన ప్రాణాలు పోయినా మంచిదే.. తన గురువు సామ్రాట్ పంతం నెగ్గించాలనుకుని, టైం బాంబ్ తో పాటు బెల్ట్ బాంబ్ ధరించాడు. ఫంక్షన్ హాల్ దగ్గరలోకి వచ్చి అతులిత్ ను రమ్మని కాల్ చేశాడు. కానీ తను వెంటనే "నువ్వే లోపలికిరా! లోపల అందరూ పెళ్లిసందడిలో తలమునకలై ఉన్నారు. టైం బాంబు అమర్చి మనం దూరంగా పారిపోదాం" అన్నాడు. జాకాల్ కి ఈ సలహా నచ్చింది. సంపత్, జ్వాలాముఖిలు కోడ్ గురించి తీవ్ర సమాలోచన చేసి అప్పటికే జాకాల్ సామ్రాట్ కు నమ్మిన బంటని, కారు డ్రైవర్ అని, ఇన్స్పెక్టర్ బలరాంను కూడా బెదిరించింది కూడా అతనేనని నిర్ధారణకు వచ్చారు. అతని కోసం గాలించవలసిన అవసరం లేదనీ ఈ కార్యక్రమాన్ని భంగం చేసేందుకు ఖచ్చితంగా వస్తాడని సంపత్ చెప్పాడు. అంతలో జాకాల్ ఫంక్షన్ హాల్ లోపలికి వస్తుండగా పోలీస్ డాగ్ అతన్ని పసి గట్టింది. ఒక్కసారిగా అతనిపైకి ఎగిరి దూకింది.అప్రమత్తమైన జ్వాలాముఖి సిబ్బందితో కలిసి అతన్ని అదుపులోకి తీసుకుంది. హుటాహుటిన అతన్ని దూరంగా తీసుకెళ్లి బాంబు స్క్వాడ్ టీమ్ తో బాంబులు డిస్పోజల్ చేయించింది. తర్వాత స్టేషన్ కు తరలించి, వారి స్టైల్లో విచారణ చేసి, సామ్రాట్ ను, అతులిత్ ను కూడా రిమాండ్ కు పంపారు.

****

మెహందీ, సంగీత్ ఫంక్షన్ కాస్త పెళ్లి వేడుకగా మారి అతిథుల ఆనందోత్సాహాల నడుమ హరి సుందరిల వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. నూతన జంటను అందరూ ఆశీర్వదించారు. ఇటు అంజలి మనసు దిగులుగా ఉంది. ఇక తప్పదని సుగుణమ్మ దగ్గరికి వచ్చి కాళ్ళ మీద పడి క్షమించుమని వేడుకుంది. తమతో పాటు అమెరికాకు రావాలని, ఏ లోటు రాకుండా తన తల్లిలా చూసుకుంటానని కన్నీటి పర్యంతమవుతూ బ్రతిమిలాడింది. దానితో సుగుణమ్మ మది కరిగింది. అలక అటక ఎక్కింది. కోపం కొండెక్కింది. చిరునవ్వు చిందిస్తూ కోడలిని లేపి హత్తుకుంది. ఇదే సందడిలో డీజేలోంచి పాటలు జోరుగా వినబడుతుంటే సిరిమువ్వ, పరిణయ, ప్రణవ్ కలిసి డాన్స్ చేస్తున్నారు. ఆ దృశ్యాన్ని చక్రవర్తి, ఇందిర,రాజీవ్, ఝాన్సీ, సంకేత్ లు చూసి మురిసిపోయారు.
అప్పుడే సిరి గురించి అంజలి ఆలోచించింది. సూర్య దగ్గరికి చేరి ,"సిరిని కూడా మనతో తీసుకెళ్దాం. పాపం.. తల్లిలేని పిల్ల ఇన్నాళ్లు ఎన్నో బాధలు పడుతూ అనేక అవమానాలకు గురైంది. మనం ఏ లోటు లేకుండా చూసుకుని మంచి భవిష్యత్తును ఇద్దాము" అంది. ఆమెలో కలిగిన మార్పు చూసి పక్కనే ఉన్న సంకేత్, ఝాన్సీ, రాజీవ్ లు కూడా సంతోషించారు. ఇందిర, చక్రవర్తి మురిసిపోయారు. సుగుణమ్మ కలగజేసుకుని "అంజలీ నీది మంచి మనసు. చాలా గొప్పగా ఆలోచించావు. సిరిమువ్వ జీవితం "ఎడారి వసంతం" లా నిష్ప్రయోజనం కాకుండా ఉండాలంటే అమెరికా తీసుకు వెళ్లడమే సరైన నిర్ణయం" అంది మురిపెంగా.అప్పుడు సూర్య సంకేత్ వైపు చూసి "ఏమంటావ్ సంకేత్" అన్నాడు. సంకేత్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "మీరు మంచి మనసుతో నా బిడ్డ జీవితాన్ని అందంగా తీర్చిదిద్దుతానంటే నేనెందుకు వద్దంటాను. మీకు జీవితాంతం రుణపడి ఉంటాను" అంటూ సూర్య కాళ్ళని మొక్కడానికి వంగాడు. వెంటనే సూర్య అతన్ని వారించి గుండెలకు హత్తుకున్నాడు.
చక్రవర్తి కలగజేసుకుని "సంకేతూ ఇన్నాళ్లు అనాథ పక్షిలా ఆగమై తిరిగావు, ఇక చాలు.. ఇకనుండి మన పర్ణశాల బాధ్యతను నీకే అప్పగిస్తా.. అలాగే పాపం ఒంటరిదైన నాగరత్నంని కూడా మన పర్ణశాలలోనే జాయిన్ చేద్దాం" అన్నాడు. దానితో అందరూ అందంగా ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంతోషానికి కారణమైన డైనమిక్ ఆఫీసర్ జ్వాలాముఖిని, ట్రబుల్ షూటర్ సంపత్ లను పుష్పగుచ్ఛాలతో ప్రేమగా సత్కరించి, కృతజ్ఞత చాటుకున్నారు. కొత్త పెళ్లిజంటతో పాటు అందరూ కలిసి గ్రూప్ ఫోటో తీయించుకున్నారు. ఎదలో దాగిన గుబులు పోయి ఆనందం అంబరాన్ని అంటింది. సైకత ఎడారిలో శీతల పవనాలు వీచి వసంత గీతాలు ఆలపించాయి.

(సమాప్తం)



వందేమాతరం @ 150

- **లోక్ సభలో ప్రత్యేక చర్చ ప్రారంభించనున్న మోడీ**

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 7: జాతీయ గీతం వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా లోక్‌సభలో సోమవారంనాడు ప్రత్యేక చర్చ జరుగనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ చర్చను ప్రారంభిస్తారు. స్వాతంత్ర్య పోరాటానికి స్ఫూర్తినిచ్చిన బంకించంద్ర ఛటర్జీ 'వందేమాతర గీతం' చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యతపై చర్చ ఉంటుంది. ఈ ప్రత్యేక చర్చకు 10 గంటల పాటు సమయం కేటాయించారు. కాగా, వందేమాతరంపై ఈనెల 9న రాజ్యసభలో జరుగునున్న ప్రత్యేక చర్చను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రారంభిస్తారని తెలుస్తోంది. రాజ్యసభలో పార్టీ నేత జేపీ నడ్డా సైతం ఈ చర్చలో పాల్గొంటారు. డిసెంబర్ 1న ప్రారంభమైన పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబర్ 19 వరకూ జరుగనున్నారు. ఎస్ఐఆర్‌పై చర్చకు విపక్షాలు పట్టుబట్టడంతో తొలి రెండ్రోజుల సమావేశాలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఎస్ఐఆర్‌పై చర్చ వెంటనే ప్రారంభించాలని విపక్షాలు పట్టుబట్టగా, బీఏసీలో తీసుకున్న నిర్ణయం ప్రకారం ముందుగా వందేమాతరంపై ప్రత్యేక చర్చ జరుపుతామని అధికార పక్షం తెగేసి చెప్పింది. దీంతో స్పీకర్ ఓం బిర్లా ఇరుపక్షాల మధ్య సయోధ్య కుదర్చడంతో తొలుత 8వ తేదీన వందేమాతరంపై ఉభయసభల్లో చర్చ జరిపేందుకు అంగీకారం కుదిరింది. అనంతరం ఎన్నికల సంస్కరణల పేరుతో ఉభయసభల్లోనూ చర్చ మొదలవుతుంది.



ప్రయాణికులకు ఇండిగో రూ. 610 కోట్లు రీఫండ్

- **వెల్లడించిన పౌర విమానయాన శాఖ**

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 7: ఇండిగో విమాన సర్వీసుల్లో దాదాపు వారం రోజులుగా అంతరాయాలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ అంశంపై దృష్టి సారించిన కేంద్రం.. ప్రయాణికులకు టిక్కెట్ డబ్బులను రీఫండ్ చేయాలని ఇప్పటికే స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో సంస్థ ఇప్పటివరకూ రూ.610 కోట్లను రీఫండ్ చేసినట్టు పౌరవిమానయాన శాఖ తాజాగా వెల్లడించింది. సుమారు 3000వేల వరకూ సూట్‌కేసులు, ఇతర లగేజీని కూడా తిరిగిచ్చినట్టు తెలిపింది. ఇక ఇండిగో కార్యకలాపాలను సాధారణ స్థితికి తెచ్చేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఆదివారాల్లో ఇండిగో రోజుకు సగటున 2,300 ఫ్లైట్ సర్వీసులు నిర్వహిస్తుంటుంది. నేడు 1,500 విమాన సర్వీసులను నడిపేందుకు ప్లాన్ చేసింది. డిసెంబర్ 10 నాటికి పూర్తిస్థాయిలో నెట్‌వర్క్ స్థిరీకరణ జరుగుతుందని కూడా సంస్థ అంచనా వేస్తోంది. సమయ పాలనకు సంబంధించి త్వరలో 75 శాతం మార్కును చేరుకుంటామని సంస్థ సీఈఓ పీటర్ ఎల్బర్స్ సిబ్బందికి తాజాగా పంపిన అంతర్గత మెసేజీలో పేర్కొన్నారు. ఇక ఫ్లైట్‌ల రద్దుపై వివరణ కోరుతూ డీజీసీఏ.. సంస్థ సీఈఓకు, అకౌంటబుల్ మేనేజర్ ఇసిడ్రో పోర్కెరాస్‌కు ఇటీవలే షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మరోవైపు, ఎయిర్‌లైన్స్‌పై రాజకీయ విమర్శలు కూడా పెరుగుతున్నాయి. ఇండిగో మేనేజ్‌మెంట్, పౌర విమానయాన శాఖ వైఫల్యం వల్లే ఈ సంక్షోభం తలెత్తిందని కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే, ఫ్లైట్‌లు అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్న ప్రయాణికుల కోసం వివిధ జోన్లు, రద్దీ ఎక్కువగా ఉన్న మార్గాల్లో రైల్వే అదనపు రైలు సర్వీసులు ప్రారంభించింది. త్వరలో డిమాండ్‌ను బట్టి మరిన్ని ప్రత్యేక రైళ్లు తెస్తామని కూడా రైల్వే అధికారులు ఇటీవల తెలిపారు.



గోవా నైట్ క్లబ్ ప్రమాదంపై పోలీసుల ఎఫ్ఐఆర్


ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 7: గోవా లోని బిర్చ్ నైట్ క్లబ్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగి 25 మంది ప్రాణాలు కోల్పోవడంపై పోలీసులు చర్యలకు దిగారు. నైట్‌క్లబ్ యజమానులు సౌరభ్ లూత్రా, గౌరవ్ లూత్రాలపై భారతీయ న్యాయసంహితలోని వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. క్లబ్ మేనేజర్, ఈవెంట్ ఆర్గనైజర్లపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్టు సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. 2013లో ట్రేడ్ లైసెన్స్ మంజూరు చేసిన రోషన్ రెడ్కార్‌ను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. అపూర్వ గ్రామంలో నైట్‌క్లబ్ నిర్మాణంలో నిబంధనలు ఉల్లంఘించారని, ఇరుకైన ప్రవేశ మార్గం, తప్పించుకునే మార్గాలు లేకపోవడం, నిర్మాణంలో మండే స్వభావం కలిగిన సామగ్రిని వాడటం వంటివి ప్రమాద కారణాలుగా ప్రాథమిక విచారణలో వెల్లడికావడంతో పోలీసులు తాజా చర్యలకు దిగారు. భద్రతా నియమాల ఉల్లంఘన జరిగినప్పటికీ క్లబ్ నిర్వహణకు అనుమతించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ చెప్పారు. కాగా అనుమతి లేకుండా నైట్‌క్లబ్ నిర్మాణం జరిగిందని, క్లబ్‌ను కూల్చేవేసేందుకు నోటీసులు జారీ చేసినప్పటికీ దానిపై హైయర్ అథారిటీ స్టే ఇచ్చిందని విలేజ్ అధికారి ఒకరు తెలిపారు. శనివారం అర్ధరాత్రి ప్రమాదం జరిగినప్పుడు నైట్‌క్లబ్‌లో సుమారు 100 మంది వరకు ఉన్నారని, సిలిండర్ పేలడంవల్ల ప్రమాదం జరిగిందని చెబుతున్నారు. మంటలు చెలరేగగానే పలువురు గ్రౌండ్ ఫ్లోర్ వైపు పరుగులు తీశారని, ప్రవేశద్వారం ఇరుకుగా ఉండటంతో వంట గదిలోనే చిక్కుకుపోయారని పోలీసులు చెప్పారు. మృతుల్లో నలుగురు టూరిస్టులు, 14 మంది సిబ్బంది ఉన్నట్టు తెలిపారు. మరో ఏడుగురిని గుర్తించాల్సి ఉందన్నారు.



అతను వంద సెంచరీలు చేయగలడు

- విరాట్ కోహ్లీపై సునీల్‌గవాస్కర్ ప్రశంసలు

స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరిగిన మూడు వన్డేల సిరీస్ లో టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ అదిరిపోయే ప్రదర్శన ఇచ్చాడు. తొలి రెండు వన్డేల్లో సెంచరీలతో చెలరేగిన విరాట్.. మూడో వన్డేలో టార్గెట్ పెద్దగా లేకపోవడంతో హ్యాట్రిక్ సెంచరీని మిస్ చేసుకున్నాడు. విశాఖపట్నంలో సౌతాఫ్రికాతో జరిగిన మూడో వన్డేలో కోహ్లీ 65 పరుగులతో నాటౌట్ గా నిలిచాడు. మూడు వన్డేల్లో కలిపి302 పరుగులతో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. ఈ క్రమంలో విరాట్ కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్ లో 100 సెంచరీలు పూర్తి చేసుకునే అవకాశముందని దిగ్గజ బ్యాటర్ సునీల్ గావస్కర్ పేర్కొన్నాడు. 2027 వరల్డ్ కప్ తర్వాత కూడా కెరీర్‌ను కొనసాగించే సత్తా కోహ్లీకి ఉందన్నాడు. మూడో వన్డే ముగిసిన అనంతరం ఓ జాతీయ మీడియాతో ముచ్చటించిన గావస్కర్.. కోహ్లీ ఫామ్ గురించి మాట్లాడాడు. ' 100 సెంచరీలు కోహ్లీకి ఎందుకు సాధ్యం కాదు?. అతడు ఇంకా కనీసం మూడు సంవత్సరాలు ఆడినా వందకు చేరేందుకు 16 సెంచరీలు మాత్రమే అవసరం. దక్షిణాఫ్రికా సిరీస్‌లో కోహ్లీ మూడు మ్యాచ్‌ల్లో రెండు సెంచరీలు చేశాడు. త్వరలో న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్‌లోనూ మరో రెండు శతకాలు చేస్తే అప్పుడు విరాట్ సెంచరీల సంఖ్య 86కు చేరుతుంది. ప్రపంచ కప్ ముగిసేనాటికి టీమిండియా దాదాపు 35 వన్డే మ్యాచ్‌లు ఆడే ఛాన్స్ ఉంది. కోహ్లీ వీటన్నింటిలో ఆడి.. ఇదే ఫామ్ కొనసాగిస్తే శతకాల శతకం చేసే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం విరాట్ తన బ్యాటింగ్‌ను ఎంజాయ్ చేస్తున్నాడు. మరోవైపు న్యూజిలాండ్‌తో సిరీస్‌కు ముందు నెల రోజుల విరామం దొరికింది. ఈ గ్యాప్‌లో అతని ఫామ్ ఏమవుతుందో చూడాలి. ఈ బ్రేక్ లేకపోతే కివీస్‌తో సిరీస్‌లో కచ్చితంగా రెండు లేదా మూడు సెంచరీలు చేసేవాడని నేను భావిస్తున్నాను' అని గావస్కర్ తెలిపాడు.





వివాదాస్పద వ్యాఖ్యలు.. వివరణ ఇచ్చిన దక్షిణాఫ్రికా కోచ్

భారత్‌తో జరిగిన గువాహటి టెస్టు మ్యాచ్ సందర్భంగా దక్షిణాఫ్రికా కోచ్ షుక్రి కాన్రాడ్ 'గ్రోవెల్' అనే పదం వాడిన విషయం తెలిసిందే. అయితే ఈ వ్యాఖ్య భారత క్రికెట్ అభిమానులను ఆగ్రహానికి గురిచేసింది. భారత్‌తో వన్డే సిరీస్ ముగిసిన అనంతరం షుక్రి వివరణ ఇచ్చాడు. అయితే, తాను ఉద్దేశపూర్వకంగా ఆ వ్యాఖ్యలు చేయలేదని తెలిపాడు. ఆ పదాలను ఉపయోగించినందుకు చింతిస్తున్నట్లు షుక్రి పేర్కొన్నాడు. ఆయన మీడియాతో మాట్లాడుతూ..' ఎలాంటి దురుద్దేశంతో ఆ వ్యాఖ్యలు చేయలేదు. ఎవరిని కించపరచాలనేది నా ఆలోచన కాదు. నేను తెలివిగా వ్యవహరించి మంచి పదం ఎంపిక చేసుకోవాల్సింది. భారత ఆటగాళ్లు ఎక్కువ సమయం ఫీల్డింగ్ కోసం మైదానంలో గడపాలన్నది నేను చెప్పాలనుకున్న ఉద్దేశము. కానీ, క్రికెట్ అభిమానులు దీనిని తప్పుగా అర్థం చేసుకున్నారు. భవిష్యత్‌లో నా భాష విషయంలో జాగ్రత్తగా ఉంటాను. ప్రతిదానికీ ఏదొక సందర్భం ముడిపడి ఉంటుంది. నా కామెంట్స్ తో వన్డే సిరీస్ ఆసక్తికరంగా మారింది. అలానే భారత్ వన్డే సిరీస్‌ను సొంతం చేసుకోవడంతో త్వరలో జరగనున్న టీ20 సిరీస్ మరింత ఆసక్తికరంగా మారుతుంది' అని షుక్రి వివరించాడు.



6/13తో చరిత్ర సృష్టించిన అర్షద్ ఖాన్

పొట్టి క్రికెట్ లో మరో సంచలనం నమోదైంది. భారత దేశవాళీ టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో యువ పేసర్ అర్షద్ ఖాన్ చరిత్ర సృష్టించాడు. మధ్యప్రదేశ్‌కు ఆడుతున్న ఈ ఎడమచేతివాటం పేసర్ లీగ్ చరిత్రలోనే అత్యుత్తమ గణాంకాలు నమోదు చేశాడు. ఛండీగఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో నిప్పులు చెరిగిన అర్షద్ కేవలం తొమ్మిది పరుగులే ఇచ్చి 6 వికెట్లతో ఔరా అనిపించాడు. స్మాట్‌లో ఇప్పటివరకూ బెస్ట్ బౌలింగ్ రికార్డు నెలకొల్పిన టి.రవి తేజ, అర్జాన్‌లను అధిగమించాడు అర్షద్. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న అర్షద్ ఖాన్ స్మాట్‌లో రెచ్చిపోయాడు. ఆదివారం ఛండీగఢ్ బ్యాటర్లను క్రీజులో నిలవనీయని అర్షద్.. సంచలన స్పెల్‌తో 6 వికెట్లు తీశాడు. రెండో ఓవర్లోనే ఓపెనర్ అర్జున్ అజాద్, శివం భాంబ్రీను ఔట్ చేసిన ఈ ఎంపీ పేసర్.. తర్వాతి ఓవర్లో మరో వికెట్ పడగొట్టాడు. 19వ ఓవర్లో మూడు వికెట్లు తీసిన ఈ స్పీడ్‌స్టర్.. టోర్నీ చరిత్రలో అత్యంత ఉత్తమ బౌలింగ్ (6/9) గణాంకాలు నమోదు చేశాడు. అర్షద్ ఖాన్ కంటే ముందు హైదరాబాద్ బౌలర్ రవితేజ, గుజరాత్ బౌలర్ అర్జాన్ నగ్వస్వల్లా 6/13తో స్మాట్‌లో రికార్డు నెలకొల్పారు. 2015లో సర్వీసెస్ పేసర్ డీఎస్ పూనియా 6/14, బరోడా స్పిన్నర్ స్వప్నిల్ సింగ్ 6/19తో అదరగొట్టారు. తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. అర్షద్ విజృంభణతో ఛండీగఢ్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 134 పరుగులకే పరిమితమైంది.



ఇంగ్లండ్‌పై ఆస్ట్రేలియా విజయం


యాషెస్ లో ఆస్ట్రేలియా వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. బ్రిస్బేన్ వేదికగా జరిగిన రెండో టెస్టులో 8 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్ పై ఆసీస్ సూపర్ విక్టరీ సాధించింది. 65 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఆస్ట్రేలియా రెండు వికెట్లు కోల్పోయి ఛేధించింది. ట్రావిస్ హెడ్ రెండో ఇన్నింగ్స్‌లో నిరాశపరిచినప్పటికీ.. జెక్ వెదరల్డ్ 17, స్టీవ్ స్మిత్ 23 పరుగులతో నాటౌట్‌గా నిలిచి సునాయాసంగా ముగించారు. బ్రిస్బేన్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 334 పరుగుల భారీ స్కోర్ చేసింది. వెటరన్ బ్యాటర్ రూట్ (206 బంతుల్లో 138) అద్భుతమైన శతకంతో చెలరేగాడు. అతడికి తోడు జాక్ క్రాలీ 76 పరుగులు, ఆఖరిలో జోఫ్రా ఆర్చర్(38 పరుగులు) మెరుపులు మెరిపించడంతో తొలి ఇన్నింగ్స్ లో ఇంగ్లాండ్ భారీ స్కోర్ చేసింది. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్ మరోసారి 6 వికెట్లతో నిప్పులు చెరిగాడు. అనంతరం ఇంగ్లీష్ జట్టుకు ఆస్ట్రేలియా కూడా ధీటైన సమాధానమిచ్చింది. కంగారులు తమ తొలి ఇన్నింగ్స్‌లో 511 పరుగుల భారీ స్కోర్ నమోదు చేశారు. స్టార్ మిచెల్ స్టార్క్ 77 పరుగులతో రాణించాడు. అలానే జెక్ వెదరల్డ్ (72), మార్నస్ లబుషేన్ (65) పరుగులు, స్టీవ్ స్మిత్(61), అలెక్స్‌క్యారీ (63) అర్ధ సెంచరీలతో మెరిశారు. దీంతో ఆస్ట్రేలియాకు తొలి ఇన్నింగ్స్‌లో 177 పరుగుల ఆధిక్యం లభించింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లిష్ బ్యాటర్లు తడబడ్డారు. 177 పరుగుల వెనుకబడి రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన ఇంగ్లాండ్ జట్టు కేవలం 241 పరుగులకే ఆలౌటైంది. జాక్ క్రాలీ(44), స్టోక్స్(50) రాణించినప్పటికి.. మిడిల్ ఆర్డర్ కుప్పకూలడంతో ఆతిథ్య జట్టు నామమాత్రపు స్కోరుకే పరిమితమైంది. తొలి ఇన్నింగ్స్ లో సూపర్ సెంచరీతో చెలరేగిన రూట్.. రెండో ఇన్నింగ్స్ లో కేవలం 15 పరుగులకే ఔటయ్యాడు. ఆసీస్ బౌలర్లలో మైఖేల్ నేజర్ ఐదు వికెట్లను తీసి.. ఇంగ్లాండ్ పతనంలో కీలక పాత్ర పోషించాడు. స్టార్క్, బోలాండ్ తలా రెండు వికెట్లు సాధించారు. 65 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా కేవలం 10 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి.. టార్గెట్ ను ఛేధించింది. ఇక ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 20 ఆధిక్యంలోకి ఆస్ట్రేలియా దూసుకెళ్లింది. ఇక ఇరు జట్ల మధ్య మూడో టెస్టు అడిలైడ్ వేదికగా డిసెంబర్ 17 నుంచి ప్రారంభం కానుంది.



శశిరేఖ.. ప్రసాదూ

డాన్స్, మాస్ అప్పీల్, యాక్షన్ అంశాల్లోనే కాదు.. నవ్వించడంలోనూ చిరంజీవి దిట్టే. ఆయన కామెడీని ఇష్టపడే వాళ్లు తెలుగు రాష్ట్రాల్లో కోకొల్లలు. వారందరికోసం కాస్త గ్యాప్ తీసుకొని కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చేశారు చిరంజీవి. ఆ సినిమానే 'మన శంకర వరప్రసాద్‌గారు'. పైగా ఈ తరహా సినిమాలు తీయడంలో సిద్ధహస్తుడైన అనిల్ రావిపూడి దర్శకుడు కావడంతో ఈ సినిమాపై అంచనాలు అంబరాన్ని తాకాయి. సంక్రాంతికి సినిమా విడుదల కానున్నది. అందుకే ప్రమోషన్స్‌లో మేకర్స్ వేగం పెంచారు. ఇప్పటికే విడుదలైన 'మీసాల పిల్ల' పాట పెద్ద హిట్. ఈ ఆదివారం మరో పాటని విడుదల చేశారు. ఈ పాట సాకీతో మొదలైంది. శంకరవరప్రసాద్ గెటప్పులో ట్రెడిషనల్ లుక్‌తో ఉన్న చిరంజీవి పడవలో వెళుతూ.. 'శశిరేఖా.. ఓమాట చెప్పాలి..' అనడం.. 'ఓ ప్రసాదూ.. మోమాటాల్లేకుండా.. చెప్పేసెయ్.. ఏమీకాదూ..' అని రాగయుక్తంగా నయనతార బదులివ్వడంతో పాట మొదలైంది. ఇక అక్కడ్నుంచి భీమ్స్ మార్క్ బీట్‌తో హుషారుగా పాట సాగింది. 'ఓ శశిరేఖా.. నీ చుట్టూ బిలియన్సూ.. నావన్నీ ఈఎమ్ఐసూ..' అంటూ ఆధునిక సాహిత్యంతో అనంత శ్రీరామ్ పాట రాయగా, భీమ్స్ సిసిరోలియో స్వరపరచి, మధుప్రియతో కలిసి పాడారు.

ఉస్తాద్ లుక్.. అదిరింది



పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీలో శ్రీలీల ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. రాశీఖన్నా కీలక పాత్రలో నటిస్తోంది. ఈ చిత్రాన్ని లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ సినిమా ఏ రేంజ్‌లో ఉండబోతుందో హింట్ ఇచ్చేసింది. ముందుగా ప్రకటించిన ప్రకారం మేకర్స్ ఫస్ట్ సింగిల్ అప్‌డేట్ లుక్‌ను విడుదల చేశారు. మీరు ప్రేమించిన, ప్రశంసించిన, విజిల్ వేసిన పవర్ స్టార్‌ను తీసుకురాబోతున్నాం. ఇప్పుడు మరింత ఎనర్జీ, స్టైలిష్ మూమెంట్స్‌తో ఉస్తాద్ భగత్ సింగ్ మొదటి సింగిల్ ప్రోమో డిసెంబర్ 9న సాయంత్రం 6.30 గంటలకు విడుదల అవుతుందని ట్వీట్ చేశారు మేకర్స్. పవన్ కల్యాణ్ నయా స్టైలిష్ లుక్‌కి ఫిదా అవుతున్నారు అభిమానులు. భగత్.. భగత్ సింగ్ మహంకాళి పోలీస్‌స్టేషన్, పత్తర్ గంజ్, ఓల్డ్ సిటీ. ఈ సారి పర్ఫార్మన్స్ బద్దలైపోద్ది.. అంటూ ఉస్తాద్ భగత్ సింగ్‌లో తనదైన మ్యానరిజంతో సాగుతున్న పవన్ కల్యాణ్ డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. గబ్బర్ సింగ్ లాంటి బ్లాక్ బస్టర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని మార్చి 26న 2026కు విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.

మరో డిఫరెంట్ పాత్రలో

'లోక చాప్టర్ వన్ - చంద్ర' సినిమాతో 300కోట్ల విజయాన్ని అందుకున్నది మలయాళ మందారం కల్యాణి ప్రియదర్శన్. సౌత్‌లో ఈ స్థాయి విజయం ఓ లేడీ ఓరియెంటెడ్ సినిమాకు రావడం నిజంగా గొప్ప విషయమే. ఈ సినిమాకు ముందు అరాకొరా విజయాలతో ఉన్న కల్యాణి ప్రియదర్శన్.. 'లోకా' విజయంతో సూపర్ హీరోయిన్‌గా అవతరించింది. ఇందులో భాగంగానే ఆమెకు లభించిన మరో అద్భుత అవకాశం 'మార్షల్'. కార్తీ హీరోగా రూపొందుతున్న ఈ చిత్రంలో కథానాయికగా కల్యాణి ప్రియర్శన్ ఎంపికైంది. నిజానికి ఈ సినిమా ఎప్పుడో మొదలైంది. కానీ హీరోయిన్‌ని మాత్రం ఎంపిక చేయలేదు. కారణం.. ఈ కథలో హీరోయిన్‌ది పెక్యులర్ రోల్. అందుకు తగ్గ కథానాయిక కోసం ఇన్నాళ్లూ అన్వేషణ జరిగింది. 'లోకా' విడుదలయ్యాక.. వాళ్లకు కల్యాణి ప్రియదర్శన్ దొరికింది. సముద్రం నేపథ్యంలో వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో కార్తీ పాత్ర ఎంత కీలకమో, కల్యాణి పాత్ర కూడా అంతే కీలకమట. ఇద్దరి గెటప్పులూ డిఫరెంట్‌గా ఉంటాయట. ఈ సినిమాలో నటిస్తుండటం వల్ల కల్యాణి ప్రియదర్శన్ ఆనందాన్ని వెలిబుచ్చింది. వచ్చే ఏడాది చివర్లో ఈ సినిమా విడుదలయ్యే అవకాశం ఉంది.





సూర్య 47.. ప్రారంభం

కోలీవుడ్ అగ్ర నటుడు సూర్య 47వ సినిమా ఆదివారం లాంఛనంగా ప్రారంభమైంది. 'సూర్య 47' వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి మలయాళ డైరెక్టర్ జీతూ మాధవన్ దర్శకుడు. 'రోమాంచమ్' సినిమాతో మలయాళంలో తొలి విజయాన్ని అందుకున్న జీతూ మాధవన్, రీసెంట్‌గా ఫహాద్ ఫాజిల్‌తో 'ఆవేశం' సినిమాను తెరకెక్కించి బ్లాక్‌బస్టర్ హిట్‌ను అందుకున్నారు. సూర్య, జీతూ మాధవన్ కాంబినేషన్‌లో సినిమా అనగానే.. ఇప్పటికే ఈ సినిమాపై అంచనాలు మొదలయ్యాయి. నజ్రియా ఇందులో కథానాయిక. 'ప్రేమలు'ఫేం నస్లేన్ కీలక పాత్రధారి. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్.ఆర్.ప్రకాశ్, ఎస్.ఆర్.ప్రభు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ సినిమా తొలి షెడ్యూల్‌ని కూడా మొదలుపెట్టారు. వైవిధ్యమైన కథ, కథనాలతో ఈ సినిమా ఉంటుందని, అద్భుతమైన పాత్రలో సూర్య కనిపిస్తారని మేకర్స్ చెబుతున్నారు. ఈ ప్రారంభోత్సవానికి సూర్య సతీమణి, నటి జ్యోతిక, హీరో కార్తి, నిర్మాత రాజశేఖర్ పాండియన్ కూడా హాజరయ్యారు.

అన్నగారు వస్తారు

కోలీవుడ్ అగ్రహీరో కార్తి కథానాయకుడిగా తమిళంలో రూపొందిన 'వా వాతియార్' సినిమా తెలుగులో 'అన్నగారు వస్తారు' పేరుతో ఈ నెల 12న విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఆదివారం ఈ సినిమా నుంచి ఓ పాటను మేకర్స్ విడుదల చేశారు. 'అలాపిక్కే ఉమ్మక్..' అంటూ సాగే ఈ పాటను రాకేందు మౌళి రాయగా, సంతోష్ నారాయణన్ స్వరపరచి, ఆలపించారు. ఇక ఈ పాట సాహిత్యం విషయానికొస్తే.. 'వలయ అహ్ కలయ.. గోలయ్య.. జై బాలయ్య.. కలలే వలరా.. గురువా నా మాటే వినరా..' అంటూ చిత్రమైన లిరిక్స్‌తో పాట సాగింది. కార్తి ఎనర్జిటిక్ స్టెప్స్ ఈ పాటకు హైలైట్. ఇప్పటికే విడుదలైన 'అన్నగారు వస్తారు' సాంగ్‌కి మంచి స్పందన వస్తున్నదని, ఈ పాట కూడా తప్పకుండా అందరికీ నచ్చుతుందని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. కృతిశెట్టి కథానాయికగా నటించిన ఈ చిత్రంలో సత్యరాజ్, మధుర్ మిట్టల్, ఆనంద్‌రాజ్, రాజ్ కిరణ్, శిల్పా మంజునాథ్ ఇతర పాత్రధారులు. నలన్ కుమారస్వామి దర్శకత్వంలో కె.ఇ. జ్ఞానవేల్‌రాజా ఈ చిత్రాన్ని నిర్మించారు.



Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200